

నేటి దినపత్రిక

# సూర్య

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

www.suryaa.com

24 ఫిబ్రవరి 2026 పేజీలు : 08

మంగళవారం


## పగడ్బందీగా ఇంటర్ పరీక్షలు

- ఇంటర్ ప్రథమ సంవత్సార పరీక్ష కు 888మంది గైర్హాజరు
- పరీక్ష కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ అజిత



నెల్లూరు బ్యూరో, మేజర్‌న్యూస్ :

ఇంటర్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. మొదటిరోజు ఇంటర్ ప్రథమ సంవత్సార పరీక్ష సంస్కృతం సబ్జెక్టుతో ప్రారంభం కాగా 888 మంది గైర్హజరయ్యారు. మంగళవారం ద్వితీయ సంవత్సరం సంస్కృత పరీక్షతో ప్రారంభం కానుంది. జిల్లా వ్యాప్తంగా మొదటి రోజు ప్రశాంతంగా జరిగినట్లు ఇంటర్ బోర్డు అధికారులు పేర్కొన్నారు. పరీక్షలకు ఎలాంటి అవంతరాలు లేకుండా అధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టారు. ఇంటర్ బోర్డు అధికారులు, జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. మొదటి రోజు ప్రారంభం కావడంతో తమ పిల్లలను తల్లితండ్రులు తీసుకొని పరీక్ష కేంద్రాలకు తరలి రావడంతో ఆయా పరీక్ష కేంద్రాల వద్ద రద్దీ వాతావరణం నెలకొంది. స్టోనహౌస్ పేట ఆ పరిసర ప్రాంతాలలో పరీక్ష కేంద్రాలవద్దకు ముందస్తుగా పోలీసులు చేరుకోవడం ఆలస్యం కావడంతో వాహనాల రాకపోకలతో ట్రాఫిక్ కొంత ఇబ్బందికరంగా మారిందని పలువురు విద్యార్థులు తల్లితండ్రులు ఆరోపించారు. స్క్వాడ్ అధికారులు పలు పరీక్ష కేంద్రాలను తనిఖీలు నిర్వహించి ఇన్విజిలెటర్స్‌కు పలు సూచనలు చేశారు.

### కండి వైద్య శిబిరంతో..

## గ్రామీణులకు మెరుగ్గైన చూపు



- గొప్ప కార్యక్రమం చేపట్టిన వరప్రసాద్ రెడ్డికి ధన్యవాదాలు
- శిబిరం ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి
- వీపీఆర్ స్ఫూర్తితోనే కంటి వైద్య శిబిరం : వర ప్రసాద్‌రెడ్డి
- కంటి చూపు విలువ లేనివారికే తెలుస్తుంది
- గ్రామాల్లో ఆర్థిక ఇబ్బందులతో కంటి చూపును పట్టించుకోరు
- నేడు 50లక్షల విలువ చేసే ఆపరేషన్లు ఉచితంగా చేయించారు
- ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు, మేజర్‌న్యూస్ :

కన్న తల్లిదండ్రులను, పుట్టిన ఊరిని మర్చిపోకూడదనే ఆశయంతో మెగా కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన శాంతా బయోటెక్నిక్స్ ఫౌండర్ వర ప్రసాద్‌రెడ్డి ఎందరికో ఆదర్శప్రాయులని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. టీపీ గూడూరు మండలం ఇస్కపాలెంలో శాంత వసంత ట్రస్టు, శంకర నేత్రాలయ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 15 నుంచి నిర్వహిస్తున్న మెగా కంటి వైద్య శిబిరం ముగింపు కార్యక్రమంలో వరప్రసాద్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిబిరాన్ని పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలను తెలుసుకున్నారు. ఆపరేషన్లు చేయించుకున్న వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వేదికపై ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎంతోమంది ఆర్థిక స్థోమత లేక కంటి చూపును నిర్లక్ష్యం చేస్తుంటారని, అలాంటి వారికి శాంత– వసంత ట్రస్టు ఆధ్వర్యంలో శంకర నేత్రాలయ సంస్థను తీసుకువచ్చి కంటి పరీక్షలు, ఆపరేషన్లు చేయించడం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా వర ప్రసాద్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తల్లిదండ్రులు వెంకట రమణారెడ్డి, శాంతమ్మల జ్ఞాపకార్థం చేపట్టిన శిబిరంలో ఈ తొమ్మిది రోజుల్లో దాదాపు 900 మందికి కంటి పరీక్షలు చేయగా 100 మంది వరకు కాటరాక్ట్ ఆపరేషన్లు చేయించారని, ఒక్కో ఆపరేషన్‌కు 50 వేలు ఖర్చవుతుండగా.. 50లక్షల విలువైన సర్జరీలు చేశారన్నారు. చెన్నైకి రిఫర్ చేసిన వారు తప్పకుండా వెళ్లి రావాలని ఆయన సూచించారు. 1993లో శాంత బయోటెక్నిక్స్ సంస్థను ఏర్పాటు చేసిన వర ప్రసాద్‌రెడ్డి అంతర్జాతీయ స్థాయిలో గొప్ప పేరు తెచ్చుకున్నారన్నారు. హెపటైటిస్–బి కి వ్యాక్సిన్ రూపొందించి ఎన్నో లక్షల మంది ప్రాణాలను కాపాడారన్నారు. ఆయన సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2005లో పద్మ భూషన్ అవార్డుతో సత్కరించినట్లు గుర్తు చేశారు. విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విపిఆర్ నేత్ర బస్సును ప్రతి గ్రామానికి తీసుకువస్తున్నామని, ఇప్పటివరకు ఉదయగిరిలోని 5 మండలాల్లో 26 వేల మందికి కంటి పరీక్షలు చేయగా.. 15వేల మందికి అద్దాలు అందించామన్నారు. త్వరలోనే ఈ గ్రామాలకు కూడా

-మిగతా 2లో

## మహిళా సాధికారతే రాష్ట్ర అభివృద్ధికి పునాది

- మహిళా సంక్షేమాన్ని మాటల్లో కాదు కార్యాచరణలో అమలు చేస్తుంది కూటమి ప్రభుత్వం
- అంగన్ వాడి కార్యకర్తలకు కనీస వేతనాల చట్టానికి అనుగుణంగా దశల వారీగా వేతనాలను పెంచాలి
- గౌరవ వేతన ఉద్యోగులుగా కాకుండా అంగన్వాడీలను సెమీ-గవర్నమెంట్ ఉద్యోగుల హోదా ఇవ్వాలి
- స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు బ్రాండింగ్, మార్కెటింగ్ అవకాశాలు కల్పించాలి
- మహిళా వ్యాపారాలకు ప్రత్యేక ఈ-మార్కెట్ ప్లేస్ ఏర్పాటు చేయాలి
- స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులను ప్రభుత్వం కొనుగోలు చేసి ప్రోత్సహించాలి
- శాసనసభ సమావేశాలలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



నెల్లూరు, మేజర్‌న్యూస్ :

మహిళలు ఆర్థికంగా బలపడితే కుటుంబం బలపడుతుందని తద్వారా రాష్టం ఆర్థికాభివృద్ధి సాధిస్తుందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పేర్కొన్నారు. మహిళా సంక్షేమం, అంగన్వాడీ కార్యకర్తల స్థితిగతులపై ఈరోజు శాసన సభలో జరిగిన చర్చలో ఆమె మాట్లాడుతూ.. మహిళా సంక్షేమానికి కేటాయింపులు పెంచి మహిళా సాధికారత దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. స్వయం సహాయక సంఘాల బలోపేతం, మహిళా రుణాలపై సబ్సిడీలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలకు ప్రత్యేక పెద్ద మొత్తంలో నిధులు కేటాయించడం నిజంగా అభినందనీయమన్నారు. మహిళా సంక్షేమాన్ని మాటల్లో కాకుండా చేతల్లో అమలు చేసి చూపిస్తున్నట్టు కూటమింపు కొత్త పాలనను ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ప్రశంసించారు. మహిళ సంక్షేమంపై ప్రభుత్వం కేటాయింపులను రాష్ట్ర భవిష్యత్తుపై పెడుతున్న పెట్టుబడిగా ఆమె అభివర్ణించారు. అనంతరం ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి అంగన్వాడీ కార్యకర్తల సమస్యల గురించి మాట్లాడుతూ.. అంగన్వాడి కార్యకర్తలకు ఏడాదిలో కనీసం 30 రోజుల చెల్లింపు వేసవి సెలవులు కల్పించాలని ఆమె ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అంగన్వాడి కార్యకర్తలకు పదవీ విరమణ సమయంలో తగిన గ్రాట్యుటీ అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. దీర్ఘ కాల సేవ చేసినా వారి భవిష్యత్ భద్రత లేదన్న విషయాన్ని ఆమె ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. సేవా కాలాన్ని పరిగణనలోకి తీసుకుని గ్రాట్యుటీ అమలు చేయాలని ఆమె ప్రభుత్వానికి మనవి చేశారు. పెరుగుతున్న జీవన వ్యయాల నేపథ్యంలో

-మిగతా 2లో

### ఎమ్మెల్యే ఆకాంక్షలకు సుదూరంగా

## ఏరియా వైద్యశాల నిర్వహణ

- నీకేంటి.. నాకేంటి అన్న చందంగా కమిటీ సభ్యుల యవ్వారం?
- అక్రమాలు ఎక్కడ వెలుగు చూస్తాయో.. అన్న సందేహంతో ? ఫోర్త్ ఎస్టేట్ పైనా ఎందుకు ఈ ఆంక్షలు.?




కావలి, మేజర్‌న్యూస్ :

ఏ దిక్కు లేనివాడికి దేవుడే దిక్కు అన్నట్టు నిరుపేద రోగులకు కావలి ఏరియా వైద్యశాలే దిక్కు. అంతేకాదు చుట్టూ 40 కిలోమీటర్ల పరిధిలో నిత్యం జరిగే రోడ్ ప్రమాదాల బాధితులకు గమ్యస్థానం. కనిపించే దేవుళ్ళకు నిలయమైన సర్కారీ దవాఖానాని ఉన్నతంగా తీర్చి దిద్దాలని ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డీ ప్రయత్నిస్తుంటే కొందరు వైద్యశాల కమిటీ సభ్యుల తీరు అందుకు భిన్నంగా ఉందన్న ఆరోపణలు మస్తుగా వినిపిస్తున్నాయ. రోగులు, వారి సంబంధీకుల వాహనాలు సంగతి దేవుడెరుగు కనీసం సంబంధిత రోగులకు ఆసరాగా వుండే బంధు మిత్రులను సైతం చెట్లకింద కూడా నిలువ నీడ లేకుండా బయటికి వెలగొడుతున్నారన్న చర్చ నడుస్తోంది. అదే సమయంలో ప్రయివేటు వ్యక్తులకు చెందిన బైకులు, కార్లు నిలుపుకునేందుకు, వారినుంచి లబ్ది పొందేందుకు ప్రత్యేక వ్యవస్థనే నడుపుతున్నట్టు సమాచారం.

-మిగతా 2లో

# ఎస్పీ పీజీఆర్ఎస్‌కు 123 ఫిర్యాదులు



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** జిల్లా పోలీస్ కార్యాలయం నందు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల సోమవారం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాదు దారులతో ఎస్పీ మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఈ కార్యక్రమంలో 123 ఫిర్యాదులు స్వీకరించినట్లు ఎస్పీ తెలియజేశారు. ప్రజా ఫిర్యాదుల పట్ల అలసత్వం ఉండరాదని, ప్రజలతో జవాబుదారీగా వ్యవహరించి పిటీషన్లను పరిష్కరించాలని ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదు లపై త్వరితగతిన స్పందించి చట్ట ప్రకారం విచారణ జరిపి న్యాయం జరిగే విధంగా పరిష్కరించాలని పోలీస్ అధికారులను ఎస్పీ ఈ సందర్భంగా ఆదేశించారు. ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం లో అడిషనల్ ఎస్పీ సిహెచ్ సౌజన్య, ఎస్బి డిఎస్పి శ్రీనివాసరావు, రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు, డిసిఆర్బి సిఐ రామారావు, మహిళా స్టేషన్ సీఐ సుబ్బారావు, ఎస్బి-1 సీఐ వెంకటేశ్వరరావు, ఎస్బి-2 సీఐ శ్రీనివాస రెడ్డి, కంప్లైంట్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

▸ కనిగిరి మండల పిఎస్‌కు చెందిన మహిళ తన కుమార్తె 03.02.2026 నుంచి కనిపించడం లేదని కర్రేద్దుల రమ్య అనే ఆమె వెంటపెట్టుకొని తీసుకెళ్లినట్టు కలిగిరి పిఎస్‌లో కేసు నమోదు అయినట్లు తన కుమార్తె ఆచూకీ కనుగొని అప్పగించాలని కోరారు.

▸ కోట మండల పిఎస్‌కు చెందిన మహిళని కోట టౌన్‌కు చెందిన సుధీర్ అను అతను 1,50,000 తీసుకొని తన స్థలానికి పాస్ బుక్కులు 1బి అడంగల్ చేయిస్తానని మాయ మాటలు చెప్పి చేయించలేదు డబ్బులు అడిగితే పట్టించుకోకుండా అవమానకరంగా తిట్టి బెదిరిస్తున్నాడని, విచారణ జరిపి న్యాయం చేయమని కోరారు.

▸ మనుబోలు మండల పిఎస్‌కు చెందిన మహిళ అదే ప్రాంతానికి చెందిన సంతోష్ అనే అబ్బాయి ప్రేమ పేరుతో తన కుమార్తెను వేదిస్తున్నట్లు అడిగితే చంపుతానని బెదిరిస్తున్నట్లు అలాగే పిర్యాది కుటుంబ సబ్యులను కూడా బెదిరిస్తున్నట్లు, విచారించి తగిన న్యాయం చేయమని కోరారు.

▸ కావలి 2 టౌన్ కు చెందిన వృద్ధ దంపతులైన గూడూరు వెంకట సుబ్బమ్మ, ఆమె భర్త కు చెందిన స్థలాన్ని తంగిసేట్టి. వెంకటేశ్వర్లు మరికొందరు కలిసి ఆక్రమించి ప్రహరి గోడ కట్టారు వారిపై కోర్ట్ నుంచి ఇంజక్షన్ ఆర్డర్స్ ఉన్నప్పటికీ ఇబ్బందులకి గురిచేస్తున్నట్లు, విచారించి న్యాయం చేయమని కోరారు.

▸ దర్గామిట్ట పిఎస్‌కు చెందిన పెద్దిరెడ్డి ఆదినారాయణ తన ఇంటిలో 29.10.2025 న గుర్తు తెలియని వ్యక్తులు బంగారం దొంగిలించినట్టు దర్గామిట్ట పిఎస్‌లో కేసు నమోదైనట్టు, విచారణ జరిపి చోరి సొత్తు రికవరీ చేయించాగలరని పిర్యాది కోరారు.

▸ ఇందుకూరుపేట పిఎస్‌కు చెందిన మహిళా తన భర్త మానసికంగా, శారీరకంగా వేదిస్తున్నట్లు నన్ను పిల్లల్ని పుట్టింటికి తరిమివేశాడని, డబ్బులు తీసుకురమ్మని వేదిస్తున్నాడని, విచారించి తగిన న్యాయం చేయమని కోరారు.

# నగరంలో పాలకేంద్రాలపై అధికారులు దాడులు



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** ఇటీవల రాష్ట్రంలో పాలకల్తీ వలన జరిగిన దుర్ఘటన దృష్టిలో పెట్టుకొని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వి.సుజాత ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, ఫుడ్ సేఫ్టీ అథారిటీ అధికారులు సంయుక్తంగా విడిపాలు అమ్ముతున్న పాలకేంద్రాలపై దాడులు నిర్వహించి వారి దగ్గర నుంచి పాలనమూలాలు సేకరించారు. నెల్లూరు పట్టణంలోని మాగుంట లేఔట్, రాంజీ నగర్, వేదయపాలెం, చిల్డ్రన్స్ పార్క్ ఏరియాలో ఈ దాడులు నిర్వహించి ఒక్కొక్క ప్రాంతం నుండి రెండు నమూనాలు, ఒకటి పాలు అమ్ముతున్న వారి దగ్గర నుండి, రెండవది పాలు కొనుక్కున్న వారి దగ్గర నుంచి మొత్తంగా ఎనిమిది పాలనమూలాలను సేకరించారు. సేకరించిన పాలనమూలాలను పరీక్షించుటకు ఫుడ్ సేఫ్టీ అథారిటీ వారి ల్యాబ్‌లకు పంపడమైనది. ఫుడ్ సేఫ్టీ అథారిటీ నుండి లైసెన్సు లేకుండా విడిపాలు అమ్ముతున్న నలుగురికి నోటీసులు జారీ చేశారు. ఫుడ్ సేఫ్టీ అథారిటీ నుండి లైసెన్స్ లేకుండా విడిపాలు విక్రయించటం చట్టరీత్య నేరమని, అలా అమ్ముతున్న వారిని గుర్తించి చట్ట పరిరమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వి. సుజాత విడిపాలు విక్రయదారులను హెచ్చరిస్తున్నారు. ఈ దాడులలో డిస్టిక్ సర్వేలెన్సు అధికారి డాక్టర్ ఎస్.భాస్కర్, ఫుడ్స్ సేఫ్టీ అధికారులు ఎం.ప్రనూతి ఫ్లోరా, డి.నీరజ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సాధికారతే రాష్ట్ర అభివృద్ధికి పునాది

(మొదటి పేజీ తరువాయి)



ప్రస్తుత గౌరవ వేతనం సరిపోవడం లేదుని, కనీస వేతనాల చట్టానికి అనుగుణంగా దశల వారీగా వేతనాలను పెంచాలని పేర్కొన్నారు. డీఏ లింకేజ్, ప్రమాద బీమా తదితర ప్రోత్సాహకాలు అందజేయాలన్నారు. అంగన్వాడి కార్యకర్తలను గౌరవ వేతన ఉద్యోగులుగా కాకుండా కనీసం సెమీ-గవర్నమెంట్ హోదా ప్రభుత్వం పరిశీలించాలన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు స్వయంగా ప్రభుత్వ సంక్షేమ పథకాల అర్హులే అయినప్పటికీ, అన్ని పథకాలు పూర్తిస్థాయిలో అందట్లేదని ఫిర్యాదులు ఉన్నాయని అర్హత ప్రమాణాలు, డేటా మిస్‌మ్యాచ్ వంటి సాంకేతిక కారణాలతో పేర్లు తొలగిపోతున్నాయని అంగన్వాడి కార్యకర్తల సమస్యలను ఆమె ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. స్వయం సహాయక సంఘాల బలోపేతం దిశగా వారి ఉత్పత్తులకు బ్రాండింగ్, మార్కెటింగ్ ఎగుమతి అవకాశాలు కల్పించాలన్నారు. మహిళా వ్యాపారాలకు ప్రత్యేక ఈ-మార్కెట్‌ప్లేస్ ఏర్పాటు చేయాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులను ప్రభుత్వం కొనుగోలు చేసే అంశాన్ని పరిశీలించాలని ఆమె ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మహిళలకు ఆర్థిక భద్రత, సామాజిక గౌరవం, వృత్తి భరోసా కల్పించడంతో పాటు సామాజికంగా, రాజకీయంగా బలపరచే దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు తన సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్టు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంత్ రెడ్డి వెల్లడించారు.

### ఎమ్మెల్యే ఆకాంక్షలకు సుదూరంగా

## ఏరియా వైద్యశాల నిర్వహణ

(మొదటి పేజీ తరువాయి)



అలాగే వైద్యశాలకు వచ్చే రోగులను తప్పుదోవ పట్టించి ప్రైవేటు హాస్పిటల్‌కు మళ్లించి కమిషన్ల దందాకు తెరతీసినట్టు కూడా కథనాలు వినవస్తున్నాయి. ఇందుకోసం ఆక్సిజన్ ప్లాంట్, ఇతర కీలక వైద్య పరికరాలు పని చేయడం లేదన్న సాకులు చూపి రోగులకు ప్రయివేటు దారి చూపి కాసుల బుట్టలు సర్దుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రతి అడుగులో అవినీతి తాండవిస్తుండగా అవి ఎక్కడ బయటపడుతాయో అన్న కోణంలో ఏకంగా మీడియాకు ఆంక్షలు విధిస్తుండడం విస్తుగొల్పుతున్న అంశం. ఏది ఏమైనా అభివృద్ధి, పేదల సంక్షేమం కోసం తపిస్తున్న ఎమ్మెల్యే ఏరియా వైద్యశాల అంశంలో లోతైన అవగాహన చేసుకుని అవినీతికి తావులేని వైద్యసేవలను పేదల దరికి చేర్చేలా ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దీనిపై వైద్యశాల సూప రేంటెండెంట్ ను వివరణ కోరగా అందుబాటులో లేరు. ఉన్నత అధికారులు, జిల్లా కలెక్టర్ చొరవ తీసుకొని ఈ వైద్యశాలపై సక్రమంగా విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కావలి పట్టణ ప్రజలు, ప్రజాసంఘాలు, రోగులు కోరుతున్నారు.

### కోవూరు షుగర్ ఫ్యాక్టరీ

## కార్మికుల బకాయిలు చెల్లించి ఆదుకోండి

- వృద్ధాప్యం, అనారోగ్య సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న కార్మికులు బకాయిల కోసం ఎదురు చూస్తున్నారు.
- ఫ్యాక్టరీ మూతపడిన నాటి నుండి నేటి వరకు కార్మికుల ? పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది
- శాసనసభలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** 15 ఏళ్లుగా మూతపడి వేలాది కుటుంబాలను రోడ్డున పడేసిన షుగర్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలపై కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి శాసనసభలో గళమెత్తారు. కోవూరు షుగర్ ఫ్యాక్టరీలో దాదాపు 3వేల మంది కార్మికులు పని చేసేవారని న్యాయం కోసం పోరాడుతూ ఆర్థిక ఇబ్బందులతో ఇప్పటివరకు సుమారు 2 వేల మంది వరకు మరణించడం అత్యంత బాధాకరమంటూ కార్మికుల దయనీయ స్థితిని సభలో ప్రస్తావించారు. ప్రస్తుతం జీవించి ఉన్న దాదాపు వెయ్యి మంది వృద్ధాప్యం, అనారోగ్య సమస్యలతో బకాయిల కోసం ఎదురు చూస్తున్నారని షుగర్ ఫ్యాక్టరీ కార్మికుల దయనీయ పరిస్థితులపై ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. 15ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కోట్లాది రూపాయల బకాయిలను వెంటనే విడుదలచేసి కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి, పరిశ్రమల శాఖ మంత్రి మానవతా దృక్పథంతో సానుకూలంగా స్పందించి షుగర్ ఫ్యాక్టరీ కార్మికుల బకాయిలను త్వరితగతిన చెల్లించి ఆదుకోవాలని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మనవి చేశారు.

## దివ్యాంగుడికి ట్రై సైకిల్ అందించిన ఎంపీ



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నడవలేని దివ్యాంగులలో ఆత్మవిశ్వాసం పెంపొందించాలనే లక్ష్యంతో నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించిన ట్రై సైకిల్స్ అందజేత నిర్విఘ్నంగా సాగుతోంది. సోమవారం విపిఆర్ నివాసంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి నెల్లూరు రూరల్ పరిధిలోని కొండాయపాలెం గేట్ సమీపంలో నివసించే శ్రీనాథ్ అనే దివ్యాంగుడికి ఎలక్ట్రిక్ ట్రై సైకిల్ అందజేశారు. తాను నడవలేనని, ఏ పని చేసుకోలేనని ట్రై సైకిల్ ఇచ్చి ఆదుకోవాలని ఆదివారం విపిఆర్‌ను శ్రీనాథ్ కలిశారు. అనుకున్నదే తడవుగా దివ్యాంగుడికి సోమవారం ట్రై సైకిల్ ఏర్పాటు చేయించారు. ఆత్మ విశ్వాసానికి వైకల్యము అడ్డుకాదని వారు పేర్కొన్నారు. దివ్యాంగులు ట్రై సైకిల్స్ ద్వారా తమ జీవితాన్ని ప్రభావవంతంగా తీర్చిదిద్దుకోవాలన్నారు.

### కంటి వైద్య శిబిరంతో..

## గ్రామీణులకు మెరుగైన చూపు

(మొదటి పేజీ తరువాయి)

సేవలు అందిస్తామన్నారు. అనంతరం వరప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.. కంటి వైద్య శిబిరం ఏర్పాటుకు విపిఆర్ ప్రారంభించిన విపిఆర్ నేత్రనే స్ఫూర్తి అని ప్రస్తావించారు. సొంత నిధులతో ప్రజలకు సేవ చేసేవారు అరుదని, రాజకీయాల్లో ఇలాంటి వ్యక్తి ఉండటం గొప్ప విషయమన్నారు. 26వేల మందికి కంటి పరీక్షలు చేయడం సాధారణ విషయం కాదన్నారు. 40-50 ఏళ్ల ఉన్న వ్యక్తుల్లో శరీరం శిథిలమవడం ప్రారంభమవుతుందని, ఆ సమయంలో కంటి చూపు మందగించడం సాధారణ విషయమన్నారు. అలాంటి వారి చూపును మెరుగుపరిచేందుకు కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. ప్రపంచవ్యాప్తంగా విస్తృత సేవలందిస్తున్న శంకర నేత్రాలయ సంస్థ ఈ గ్రామానికి వచ్చి క్యాంపు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. గ్రామీణులకు ఎంతో ఓపికతో ఆపరేషన్లు చేస్తున్న డాక్టర్లకు, సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్థులు, టీడీపీ నాయకులు కోడూరు కమలాకర్‌రెడ్డి, కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, గుడి హరిరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సోలార్ విద్యుత్ సేవలపై విస్తృత ప్రచారం చేయాలి

## నెల్లూరు రూరల్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఎల్ ప్రసాద్



**నెల్లూరు/వేదాయపాలెం, మేజర్‌న్యూస్ :** ప్రధాన మంత్రి సూర్యఘర్ ముప్తి బిజిలి యోజన పథకం ద్వారా ఏపీ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమల్లోకి తెచ్చిన సోలార్ విద్యుత్ సేవల వల్ల గృహ వినియోగదారులకు చేకూరే బహుళ ప్రయోజనాలపై క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారంతో అవగాహన కల్పించాల్సిన బాధ్యత విద్యుత్ అధికారులు అందరిపై ఉందని నెల్లూరు రూరల్ విద్యుత్ ఆపరేషన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎల్ ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక విద్యుత్ భవన్లోని రూరల్ డివిజన్ కార్యాలయం నుంచి నెల్లూరు రూరల్, ముత్తుకూరు, పొదలకూరు, రాపూరు సబ్ డివిజన్స్, సెక్షన్లకు చెందిన డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు అసిస్టెంట్ ఇంజనీర్లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన మాట్లాడుతూ.. గృహ వినియోగదారులు సోలార్ విద్యుత్ మీటర్‌ను ఏర్పాటు చేసుకునేందుకు మాత్రమే డబ్బులు చెల్లించాల్సి ఉంటుందని, అదనంగా ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. సింగిల్ మీటర్ ఏర్పాటు చేసుకున్న వినాయక దారుడు (4 కిలోవాట్స్ వరకు) రూ.3,600, అదేవిధంగా త్రీ ఫేస్‌కు సంబంధించి(14కిలో వాట్స్ వరకు) రూ.5605, అలాగే 15 నుంచి 37 కిలోవాట్స్ వరకు సామర్థ్యం కలిగిన సిటీ మీటర్‌కు రూ.8306 చొప్పున అయ్యే ఖర్చును మాత్రమే వినియోగ దారుడు చెల్లించాల్సి ఉంటుందన్నారు. సోలార్ మీటరు కొరకు గృహ వినియోగదారుడు వెబ్ సైట్‌లో పేరు నమోదు చేసుకున్న తర్వాత వెండర్ ఎంపిక జాబితాలో ఎంతమంది ఉన్నారన్న సమాచారం మొత్తం వెబ్ సైట్‌లో పొందుపరచబడి ఉంటుందని, ఎంపికైన వెండర్‌కు సోలార్ పలకలతోపాటు అవసరమైన వస్తు పరికర సామాగ్రి అందజేయడం జరుగుతుందన్నారు. ఈ ప్రక్రియ మొత్తం వెండర్, వినియోగదారుడికి మాత్రమే సంబంధించినదై ఉంటుందని, ఇందులో విద్యుత్ పంపిణీ సంస్థకుగాని, సంస్థలో పనిచేసే ఉద్యోగులకు గాని ఎటువంటి సంబంధం ఉండదన్నారు. ఈ ప్రక్రియ మొత్తం పూర్తయిన తర్వాత సమాచారమంతా డిఈఈ లాగిన్‌కు వెళుతుందన్నారు. డిఈఈ స్వయంగా వచ్చి పరిశీలించిన తర్వాత సదరు వినియోగదారుడు ఇండియాలో తయారైన ప్యానెల్ వాడుతున్నారా, లేదా, లైటనింగ్ ఎరస్టర్( పిడుగులు పడినప్పుడు సోలార్ ప్యానెల్స్ దెబ్బతినకుండా)ఏర్పాటు చేసుకున్నారా, లేదా, 3 ఎర్త్ పైపులు బిగించారా, లేదా, అన్న విషయాలను నిర్ధారించుకొని సమగ్ర నివేదికతో రిపోర్ట్ ఇచ్చిన తర్వాత సోలార్ మీటర్ బిగించడం జరుగుతుందన్నారు. సోలార్ సర్వీస్‌కు నగదు చెల్లించిన వినియోగదారుడు 15 రోజుల్లోపు బ్యాంకు నుంచి సబ్సిడీ రుణాన్ని పొందే అవకాశం ఉంటుందన్నారు. ఇదే క్రమంలో విద్యుత్‌శాఖ ద్వారా రాయలసీమ జోన్ పరిధిలోని 8 జిల్లాల్లో రూ.6,500 కోట్ల అంచనాలతో అమలవుతున్న ఆర్‌డిఎస్‌ఎస్ పథకం పనులు నెల్లూరు నియోజకవర్గంలో శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ప్రస్తుతం నెల్లూరు రూరల్ నియోజకవర్గం ఆధీనంలో ఉన్న సర్వేపల్లి నియోజకవర్గంతోపాటు రాపూరు సబ్ డివిజన్ పరిధిలోని రాపూరు, కలువాయి, సైదాపురం మండలాల్లో పనులు జరుగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు యు ప్రభాకర్ రావు, జువ్వి గుంట రాము, పి.సుబ్రహ్మణ్యం, యు.సురేష్‌తోపాటు అసిస్టెంట్ ఇంజనీర్లు, టెక్నికల్ విభాగాలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు.

# నైపుణ్యం అందించేందుకు ఉచిత శిక్షణ



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన పి 4 (పబ్లిక్ ప్రైవేట్ పీపుల్స్ పార్ట్నర్షిప్) కార్యక్రమంలో భాగంగా ప్రముఖ శిక్షణ సంస్థ డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ అకాడమీ, ఎన్జీవో బార్ సివిఆర్ అకాడమీలు సంయుక్తంగా ఔత్సాహిక విద్యార్థిని, విద్యార్థులకు సివిల్ సర్వీసెస్ పరీక్షలలో నైపుణ్యం అందించేందుకు ఉచిత శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్టు నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ తెలిపారు. కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి అకాడమీ నిర్వాహకులతో కలిసి కమిషనర్ బ్రోచర్ ఆవిష్కరించిన అనంతరం మాట్లాడారు. ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్ వంటి సివిల్ సర్వీసెస్ అర్హత సాధించేందుకు అవసరమైన శిక్షణ కోసం మహిళా విద్యార్థులు మార్చి 10వ తేదీ లోపు అప్లై చేయాలని, మార్చి 15వ తేదీ ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా ఎంపిక చేసిన 100 మందికి మార్చి 23 నుంచి విజయవాడలో శిక్షణ అందిస్తారని తెలిపారు. ఔత్సాహిక పురుష విద్యార్థులు మార్చ్ 31 నాటికి దరఖాస్తు చేసుకుంటే ఏప్రిల్ 5వ తేదీన ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహించి అర్హత సాధించిన 100 మందికి ఏప్రిల్ 22 నుంచి వినుకొండలో శిక్షణ ప్రారంభిస్తారని తెలిపారు. మూడు సంవత్సరాల పాటు పూర్తి ఉచితంగా వసతి తో కూడిన శిక్షణను అందించి విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్ ఉచితంగా అందజేస్తారని కమిషనర్ తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనుకునేవారు 78420 54669 నెంబర్‌కు సంప్రదించి ఆన్లైన్లో నమోదు చేసుకునేందుకు వివరాలను పొందాలని తెలిపారు. స్టడీ సెంటర్ నిర్వాహకులు డాక్టర్ లక్ష్మయ్య మాట్లాడుతూ పేద విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను అధిగమించేందుకు పేదరికం అడ్డుకాకూడదనే ఏకైక లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచనల మేరకు పి4 కార్యక్రమం ద్వారా ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. తమ స్టడీ సర్కిల్ ద్వారా ఉన్నత విద్యావంతుడై, నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్‌గా వైఓ నందన్ విధులు నిర్వహించడం ఎంతో గర్వకారణం అని ప్రశంసించారు.

# తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడండి

## ఎంపీడీఓకి బీజేపీ నాయకులు వినతి

**కొండాపురం, మేజర్‌న్యూస్ :** మండలంలో వేసవి కాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు అధికారులను కోరారు. 'జనతా వారధి' కార్యక్రమంలో భాగంగా భారతీయ జనతా పార్టీ (బీజేపీ) కొండాపురం మండల అధ్యక్షుడు జడపల్లి మహేష్ ఎంపీడీఓను కలిసి వినతిపత్రం సమర్పించారు. మండలంలోని పలు గ్రామాల్లో పంచాయతీ బోర్లు చెడిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే మరమ్మతులు చేపట్టి వాటిని అందుబాటులోకి తీసుకురావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వేసవిలో నీటి కొరత తీవ్రరూపం దాల్చే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలు తీసుకుని గ్రామాల్లో తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు కృష్ణారావు, బాబు,



బషీర్ తదితరులు పాల్గొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామని బీజేపీ నాయకులు తెలిపారు.

# విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఏఎస్ పేట మండలం చిరమణ జడ్పీ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ చేశారు. దివంగత కంచర్ల శేషయ్య నాయుడు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ట్రస్టు తరుపున కంచర్ల సురేంద్ర, డి.సాయి ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలు రాసేందుకు ప్యాడ్స్, ఫైల్స్, జామెంట్రీ బాక్సులను ఎంఈఓ చేతుల మీదుగాపంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వాణి, బోధన బోతనేతర సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు చేశారు.

# సంత్ గాడ్గే బాబా 150వ జయంతి వేడుకలు



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో స్థానికరంకు ట్రంక్ రోడ్‌లో ఏరియా వైద్యశాల దగ్గర బాబా 150వ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా కావలి నియోజకవర్గంలో కలిసి రజక నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. సంత్ గాడ్గే బాబా, మహారాష్ట్రలో పుట్టి ప్రజల కొరకు తను గాడ్గే లాగా తిరిగి ఎంతో నిరుపేదలకు ఆకలి తీర్చి విద్యాసంస్థలను నెలకొల్పిన వ్యక్తి గాడ్గే బాబా అని వారు చేసిన సేవలను కొనియాడారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని మనం కూడా ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమాన్ని కావలి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న అన్ని వార్డులలో కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజలకు సేవలు అందించాలని వారు తెలిపారు. కార్యక్రమం చిలకపాటి మధు ఆధ్వర్యంలో అందరూ పాల్గొని కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు.

# ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరులో సోమవారం ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి పట్టణంలో శ్రీ వివేకానంద జూనియర్ కళాశాల శ్రీ నేతాజీ వికాస్ జూనియర్ కళాశాల వైఆర్ జూనియర్ కళాశాల కేంద్రాలుగా ఈ పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజున మొదటి సంవత్సరం పరీక్షకు శ్రీ నేతాజీ వికాస్ కళాశాలకు 223 మంది కేటాయించగా ఐదు మంది విద్యార్థులు గైర్హాజరు. కాగా 218 మంది హాజరైనట్టు ఆ పరీక్ష చీఫ్ అధికారి వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. వైఆర్ జూనియర్ కళాశాలకు 260 మంది మంజూరు కాగా 28 మంది గైర్హాజరు కావడంతో 232 మంది హాజరైనట్లు ఆ కళాశాల చీఫ్ అధికారి పద్మనాభం తెలిపారు. అదేవిధంగా శ్రీ వివేకానంద జూనియర్ కళాశాలకు 135 మంది మంజూరు కాగా మంజూరు ముగ్గురు గైర్హాజరు అయినట్లు 132 మంది హాజరయ్యారని ఆ కేంద్ర చీఫ్ అధికారి ఏ వెంకటకృష్ణయ్య తెలిపారు. మొదటి రోజు పరీక్ష కేంద్రాలను ఇన్చార్జి తహసిల్దార్ ఓబయ్య పరిశీలించారు. ఎస్ఐ వీర ప్రతాప్ కేంద్రాల వద్ద బందోబస్తుపై సిబ్బందిని నియమించారు. మొదటిరోజు పరీక్ష ప్రశాంతంగా జరిగింది.

# డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమానికి 2 ఫిర్యాదులు



**నెల్లూరు/వేదాయపాలెం, మేజర్‌న్యూస్ :** జిల్లా కేంద్రమైన నెల్లూరు నగరంలోని దర్గామిట్ట ప్రాంతంలో ఉన్న విద్యుత్ భవన్ సర్కిల్ కార్యాలయం నందు సోమవారం ఆంధ్రప్రదేశ్ దక్షిణ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'డయల్ యువర్ ఎస్ఈ' కార్యక్రమానికి జిల్లాలోని అన్ని డివిజన్ల నుండి మొత్తం 2 ఫిర్యాదులు అందినట్లు జిల్లా విద్యుత్‌శాఖ సూపరింటెండింగ్ ఇంజనీరు కె.రాఘవేంద్రం తెలిపారు. ఈ ఫిర్యాదుల్లో ఒకటి నూతన సర్వీస్ మంజూరు కొరకు, అదేవిధంగా రెండవది ట్రాన్స్ ఫార్మర్ తదితర అంశాలకు సంబంధించినవిగా ఉన్నాయని వివరించారు. వెంటనే సంబంధిత అసిస్టెంట్ ఇంజనీరుకు తెలియజేయడం జరిగిందని, వినియోగదారుని సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమం ద్వారా అందిన ప్రతి ఫిర్యాదును చాలా సీరియస్‌గా తీసుకొని, సంబంధిత అసిస్టెంట్ ఇంజనీర్లకు వెంటనే తెలియజేసి, సమస్యల రెక్టిఫికేషన్ పూర్తి చేసిన అనంతరం ఫోటోతో సహా నివేదిక సమర్పించాలని ఆదేశించినట్లు తెలిపారు. వినియోగదారుల సమస్యలను వేగంగా పరిష్కరించాలనే లక్ష్యంతో ప్రతి సోమవారం 'డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్, టౌన్ విద్యుత్ ఆపరేషన్ డివిజన్ విభాగాలకు చెందిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు శేషాద్రి బాల చంద్ర, మన్నేపల్లి శ్రీధర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మునీంద్ర, అసిస్టెంట్ ఇంజనీర్లు తిరుపతయ్య, నరసింహారావు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# డిగ్రీ ఫలితాల్లో 'విజ్ఞాన్ డిగ్రీ కళాశాల' విద్యార్థుల హవా



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** వీఎస్‌యూ ఇటీవల విడుదల చేసిన డిగ్రీ పరీక్షల ఫలితాల్లో విజ్ఞాన్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. వివిధ విభాగాల్లో అత్యుత్తమ జీపీఏలు సాధిస్తూ మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ,తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. వీరికి సోమవారం విజ్ఞాన్ కళాశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో శాలువా పుష్పగుచ్చాలతో అభినందించి, స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ నారాయణ రెడ్డి మాట్లాడుతూ.. తమ కాలేజీలో థర్డ్ ఇయర్ బీఎస్సీ కంప్యూటర్స్ ఐదవ సెమిస్టర్‌లో ఏ.కల్పన 9.26 జీపీఏతో మండల ఫస్ట్ సాధించి కళాశాలకు కీర్తి తెచ్చారన్నారు. అదే విభాగంలో ఎస్.అంకమ్మ 9.2 జీపీఏతో మండల సెకండ్ స్థానాన్ని, 8.89 జీపీఏతో డి.శిరీష కళాశాల తృతీయ స్థానం దక్కించుకున్నారన్నారు.ఇక సెకండ్ ఇయర్ థర్డ్ సెమిస్టర్ బీఎస్సీ కంప్యూటర్స్ విభాగంలో కె.శశి కళ 9.0 జీపీఏతో మండల ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోగా, వాకాటి పూజ శ్రీ 8.93 జిపిఏతో మండల సెకండ్ స్థానంలో నిలువగా, పి.ప్రణయ లిఖిత 8.8 జీపీఏతో కళాశాల తృతీయ స్థానంలో సాధించిందన్నారు.బీకాం కంప్యూటర్స్ గ్రూపులో థర్డ్ ఇయర్ ఐదవ సెమిస్టర్‌లో జీ.హైమావతి 8.7 జీపీఏతో మండల సెకండ్ స్థానం సాధించగా, సెకండ్ ఇయర్ థర్డ్ సెమిస్టర్‌లో ఏ.ఆమని 8.47 జీపీఏతో కాలేజీ ఫస్ట్‌తో పాటు మండల సెకండ్ స్థానాన్ని కూడా దక్కించుకున్నారు.విద్యార్థుల ఈ విజయంపై కళాశాల యాజమాన్యం ఎం.సుధాకర్ రెడ్డి, ప్రిన్సిపాల్ జీ.నారాయణరెడ్డి, ఏ.సుబ్బారావు, సి.హెచ్ వెంకట కృష్ణ, ఎ.చంద్రశేఖర్ ఆకాంక్షించారు అధ్యాపకులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

# అంగన్వాడీ కార్యకర్తల యూనియన్ రిలే నిరాహార దీక్ష



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు ప్రాజెక్ట్ పరిధిలోని వింజమూరు, కలిగిరి, కొండాపురం మండలాలలో పనిచేసే అంగన్వాడీ కార్యకర్తలు వింజమూరు ఐసిడిఎస్ కార్యక్రమం ఎదుట రిలే నిరాహార దీక్ష చేపట్టారు. సాక్ష్యమైన మా డిమాండ్లను పరిష్కరించాలంటూ నిరాహార దీక్షలు ప్రారంభించారుఈ సందర్భంగా వింజమూరు ప్రాజెక్టు కార్యదర్శి పుష్పలత మాట్లాడుతూ.. గత ప్రభుత్వం నుండి ఇప్పటి వరకు మాకు కనీస వేతనం ఇవ్వకుండా, మా డిమాండ్స్‌ని పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వాలు ఎన్ని మారిన మా జీవితాలు మారడం లేదని మా సమస్యలు ఎప్పటిలాగే ఉన్నాయని తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు విధులు నిర్వహిస్తూనే ఉన్నామని అయినప్పటికీ మా కష్టాన్ని గుర్తించకుండా సమస్యలను పరిష్కరించకుండా ఏ ప్రభుత్వం వచ్చిన కాలయాపన చేస్తుందన్నారు. మమ్మల్ని తక్షణమే ప్రభుత్వ ఉద్యోగులగా గుర్తించి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని పని భారాన్ని తగ్గించాలని మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగించాలని వేసవికాలంలో అంగన్వాడీ కేంద్రాలకు సెలవులు మంజూరు చేయాలని ఫలాలు అందించాలని ఇతర సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. మాకు గౌరవ వేతనం 26 వేలుకి పెంచాలని డిమాండ్ చేశారు. డిమాండ్లను పరిష్కరించేంత వరకు ఈ పోరాటం ఆపేదిలేదని తెలిపారు. అనంతరం సీఐటీయూ కన్వీనర్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. అంగన్వాడి కార్యకర్తలకు సంక్షేమ పథకాలు వర్తింపచేసేలా, వేసవి సెలవులు మంజూరు చేయాలనీ, పని భారం తగ్గించాలని సీఐటీయూ తరుపున ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో విజయమ్మ శారదా శ్రీదేవి ఇతర అంగన్వాడి కార్యకర్తలు సిఐటియు సభ్యులు తదితరులు ఉన్నారు.

# బివీ నగర్‌లో సోలార్ పలకల పరిశీలన



**నెల్లూరు/వేదాయపాలెం, మేజర్‌న్యూస్ :** ఏపీ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ నెల్లూరు టౌన్ డివిజన్ ఆధీనంలో ఉన్న బీవి నగర్ సెక్షన్ పరిధిలోని బ్యాంకు కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన 3 కిలోవాట్ సామర్థ్యపు సోలార్ విద్యుత్ పలకలను సోమవారం జిల్లా సూపరిండెంటింగ్ ఇంజనీరు కే.రాఘవేంద్రం స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గృహ వినియోగదారుల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమల్లోకి తెచ్చిన సోలార్ విద్యుత్ వ్యవస్థ ద్వారా అనేక ప్రయోజనాలతోపాటు లాభాలను పొందే అవకాశం ఉంటుందన్నారు. ఈ సోలార్ విద్యుత్ వ్యవస్థ ఏ.వీరరాఘవయ్య పేరిట (సర్వీస్ నెంబర్ 3311308316608) ఏర్పాటు చేయబడిందన్నారు. సోలార్ వ్యవస్థ ఏర్పాటు విధానం, ఉపయోగించిన సామగ్రి నాణ్యతతో పాటు, వెండర్ ద్వారా అనుసరించిన ప్రమాణాలు, భద్రతా నియమాలను సమగ్రంగా పరిశీలించడం జరిగిందన్నారు. విద్యుత్ వినియోగదారులకు దీర్ఘకాలిక ప్రయోజనం కలిగే విధంగా పనులు నాణ్యతతో నిర్వహించాల్సిందిగా వెండర్‌కు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షక ఇంజనీరు రాఘవేంద్రంతోపాటు టౌన్ విద్యుత్ ఆపరేషన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు మన్నేపల్లి శ్రీధర్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు టీవీ రాంప్రసాద్ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొని, భాగస్వామ్యమయ్యారు.

## మండలంలో ప్రశాంతంగా ఇంటర్మీడియట్ పరీక్షలు



**కొండాపురం, మేజర్‌న్యూస్ :** సోమవారం నుండి మొదలైన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు సందర్భంగా కొండాపురం మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్ జూనియర్ కళాశాలలో నందు ఎస్ఐ జె.మాల్యాద్రి తన సిబ్బందితో కట్టుదిట్టమైన భద్రత కల్పిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నిర్వహణ పారదర్శకంగా, నిశిత నిఘా నీడలో సాగుతోంది. పరీక్షా కేంద్రాలను ఎస్పైలు, పోలీస్ అధికారులు పరిశీలిస్తూ బందోబస్తు చర్యలు చేపడుతున్నారు. నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమని, మొబైల్ ఫోన్లు నిషేధమని, సిసి కెమెరాల పర్యవేక్షణ ఉంటుందని పరీక్ష నిర్వహణ అధికారులు తెలిపారు. అలాగే ఇంటర్మీడియట్ పరీక్షలు పకడ్బందీగా పోలీసుల సంరక్షణలో కఠిన నిబంధనలు ఉంటాయని, ఎవరైనా నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హిమాన్షు శుక్ల మీడియా ద్వారా తెలిపారు.

## రూ.3.53కోట్లతో అభివృద్ధి పనులు

- టీడీపీ నాయకులు గిరిధర్ రెడ్డి



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలో 17వ డివిజన్ హరనాథపురం జంక్షన్ వద్ద 1 కోటి 20 లక్షల రూపాయలతో నిర్మించిన సూర్య నమస్కారాలు, గ్రీన్ స్పేస్ డెవలప్మెంట్ పనులను కూటమి నాయకులతో కలిసి సోమవారం టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పరిశీలించారు. ఎన్నడు లేని విధంగా కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి 17వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు 3కోట్ల 53లక్షల రూపాయలు కేటాయించడం జరిగిందనిటిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి తెలిపారు. సూర్య నమస్కారాలు, గ్రీన్ స్పేస్ డెవలప్మెంట్ పనులు దాదాపు పూర్తయ్యాయనిత్వరలోనే మిగిలిన పనులను కూడా పూర్తి చేసి ప్రారంభిస్తాం అని టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తెలిపారు. పై కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఈఈ శేషగిరి రావు, కార్పొరేటర్‌లు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, కో క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, డివిజన్ అధ్యక్షులు, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అధినేత ఆశయాలకు అండగా నిలుద్దాం..

- జనసేన సభ్యత్వ నమోదును జయప్రదం చేయండి
- మండల ప్రధాన కార్యదర్శి సింగమనేని అరవింద్ యాదవ్



**జలదంకి, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పార్టీ కార్యకర్తల సంక్షేమం కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మండలంలో విజయవంతం చేయాలని సోమవారం జనసేన పార్టీ జలదంకి మండల ప్రధాన కార్యదర్శి సింగమనేని అరవింద్ యాదవ్ కోరారు. ఈ సందర్భంగా అరవింద్ మాట్లాడుతూ.. ఈనెల 26వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా సభ్యత్వ నమోదు ప్రక్రియ ప్రారంభం కానుందని అరవింద్ యాదవ్ తెలిపారు. పార్టీ కార్యకర్తల బీమా, ఇతర సంక్షేమ కార్యక్రమాల కోసం అధినేత పవన్ కళ్యాణ్ స్వయంగా రూ.2 కోట్లు విరాళం అందజేయడం ఆయనకు సైనికులపై ఉన్న మక్కువకు నిదర్శనమని కొనియాడారు. భవన నిర్మాణ కార్మికులు, రైతులు, యువత, వివిధ రంగాల్లో పనిచేస్తున్న ప్రతి ఒక్కరికీ ఈ సభ్యత్వం ప్రాముఖ్యతను వివరించాలని ఆయన కోరారు. జనసేన నాయకులు, జనసైనికులు, వీర మహిళలు ఇంటింటికీ వెళ్లి సభ్యత్వ నమోదు ఉద్దేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఎవరికి ఏ చిన్న కష్టం వచ్చినా చలించిపోయే వ్యక్తిత్వం పవన్ కళ్యాణ్‌ది అని అటు వ్యక్తిగతంగా సహాయం అందిస్తూనే, ఇటు ప్రభుత్వపరంగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు అని అన్నారు. కష్టపడే ప్రతి కార్యకర్తకు జనసేన పార్టీ అండగా ఉంటుంది' అని అరవింద్ యాదవ్ తెలిపారు.

# పోలిరెడ్డిపల్లిలో పూర్వ విద్యార్థుల చేయూత





**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మర్రిపాడు మండలంలోని చిన్నమాచనూరు పంచాయతీ పరిధిలో ఉన్న పోలిరెడ్డిపల్లి ప్రభుత్వ హైస్కూల్‌కు పూర్వ విద్యార్థులు ఆదర్శప్రాయంగా నిలిచారు. 2004-05 విద్యా సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు కలసికట్టుగా ముందుకు వచ్చి సుమారు రూ.1.20లక్షల వ్యయంతో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి పాఠశాల విద్యార్థులకు సోమవారం విరాళంగా అందించారు. పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు శుద్ధమైన తాగునీటి సౌకర్యం అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పూర్వ విద్యార్థులు తెలిపారు. వేసవి కాలంలో విద్యార్థులు తాగునీటి సమస్యలను ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఈ మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం ద్వారా వారికి ఆరోగ్యకరమైన నీరు నిరంతరం అందేలా చర్యలు తీసుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థుల ఈ సేవను అభినందించారు.తాము చదువుకున్న పాఠశాలకు తిరిగి సేవ చేయడం గొప్ప విషయం. ఇది ఇతర బ్యాచ్‌లకు కూడా స్ఫూర్తిగా నిలుస్తుంది అని పేర్కొన్నారు. విద్యార్థులు కూడా ఆనందం వ్యక్తం చేస్తూ, శుద్ధమైన తాగునీటి సదుపాయం కల్పించిన పూర్వ విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామస్థులు, తల్లిదండ్రులు ఈ కార్యక్రమాన్ని ప్రశంసిస్తూ, విద్యాసంస్థల అభివృద్ధిలో పూర్వ విద్యార్థుల భాగస్వామ్యం ఎంతో కీలకమని అభిప్రాయపడ్డారు. పాఠశాల మౌలిక సదుపాయాల మెరుగుదలకు ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత అవసరమని వారు సూచించారు.

# ప్రభుత్వ స్థలం అనే అక్రమ నిర్మాణం తొలగింపు : కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ పాల్గొని అర్జీ దారుల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో కమిషనర్ మాట్లాడుతూ.. అర్హులైన లబ్ధిదారులందరూ 300 చ.అ ఉచిత టిడ్కో గృహాల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నోటీసులు ఇచ్చినప్పటికీ గృహాలకు రిజిస్ట్రేషన్ చేసుకోకుండా స్వాధీనం పొందని 408 టిడ్కో గృహాలను అర్హులైన ఇతరులకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 ద్వారా ఈ వారంలో అందజేసేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేశామని కమిషనర్ ప్రకటించారు. ఏపీ స్టేట్ హౌసింగ్ బోర్డ్ కార్పొరేషన్ ద్వారా నిర్మించిన లేఔట్లలోని గృహాలను లబ్ధిదారులు స్వాధీనం పొంది నివాసం ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ తెలిపారు. వరద ముంపు రహిత నగరాన్ని తీర్చిదిద్దే క్రమంలో భాగంగా సుమారు 50కోట్ల రూపాయలతో ప్రధాన ఇరిగేషన్ కాలువల ఆధునికీకరణ పనులను చేపట్టామని, డ్రైను కాలువల అభివృద్ధి నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయనున్నామని తెలిపారు. డ్రైను ప్రవాహానికి అడ్డంకిగా, డ్రైను కాలువలపై, ఇతర ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మించిన నిర్మాణాలను తప్పనిసరిగా తొలగించి వేస్తామని కమిషనర్ స్పష్టం చేశారు. శాంతినగర్ పరిధిలో జరిగిన ఆక్రమణల తొలగింపు లో ఎలాంటి అధికార దుర్వినియోగం లేదని ప్రభుత్వ స్థలం అని స్పష్టంగా నిర్ధారించిన తర్వాతే అక్రమ నిర్మాణాన్ని తొలగించామని కమిషనర్ స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో విభాగాల వారీగా టిడ్కో హౌసింగ్ 17, టౌన్ ప్లానింగ్ 11, రెవెన్యూ 15, ఇంజనీరింగ్ 03, పబ్లిక్ హెల్త్ 08, అకౌంట్ సెక్షన్ 01, పెన్షన్ 02, ఆప్కాస్ 06, మొత్తం 63 వినతులను కమిషనర్ స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఇంజనీరింగ్ విభాగం ఈఈ లు శేషగిరిరావు, అనిల్ కుమార్, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ దినేష్, అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 350 ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయండి

● ఏపీ జెన్కో ప్రాజెక్ట్ ఉన్నతాధికారులకు నిర్వాసితులు విజ్ఞప్తి



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు 438 ప్రకారం 350 ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని కాంట్రాక్ట్ కార్మికులు ఏపీ జెన్కో ప్రాజెక్ట్ ఉన్నతాధికారులను కోరారు. సోమవారం ప్రాజెక్టు మేనేజింగ్ డైరెక్టర్ పుల్లారెడ్డి (ఎఫ్ఎసి) ప్రాజెక్టుకు విచ్చేశారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ కార్మికులతోపాటు నిర్వాసితులు ఆయనను కలిసి పలు సమస్యలను తెలియజేసుకున్నారు. ప్రాజెక్టులో పని చేస్తున్న భూ నిర్వాసితులను పర్మినెంట్ చేయాలన్నారు. ప్రాజెక్టులో పని చేస్తున్న కార్మికులను అనుభవం ప్రకారం కేటగిరి కల్పించాలని డిమాండ్ చేశారు. భూములు కోల్పోయిన 39 మంది బాధిత కార్మికులకు మరల స్కిల్ కేటగిరి ఇవ్వాలని కోరారు. గ్రామాన్ని త్వరగా తరలించాలని విన్నవించారు. హరిజనవాడ గ్రామానికి అవసరమైన స్థలాన్ని సేకరించి సురక్షిత ప్రాంతానికి తరలించాలన్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని మేనేజింగ్ డైరెక్టర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్మికులు, నిర్వాసితులు, ప్రాజెక్ట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విక్రమ్ నగర్‌లో పర్యటించిన కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ పారిశుధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా సోమవారం స్థానిక 26వ డివిజన్ విక్రమ్ నగర్ ప్రాంతంలో అధికారులతో కలిసి పర్యటించారు. డివిజన్ పరిధిలో అన్ని భవనాలను అసెస్మెంట్ పరిధిలోకి తీసుకురావాలని ఆదేశించారు. 100శాతం నిర్దేశించిన ఆస్తి పన్ను, తాగునీటి కొళాయి పన్ను, ఖాళీ స్థలం పన్నులను వసూలు చేయాలని ఆదేశించారు. నూతనంగా నిర్మిస్తున్న భవనాలకు పట్టణ ప్రణాళిక విభాగం అనుమతులు తప్పనిసరిగా ఉండేలా పర్యవేక్షించాలని సూచించారు. నగరవ్యాప్తంగా జరుగుతున్న నక్ష ప్రాజెక్ట్ సర్వేకు ప్రజలంతా సహకరించి భవనాలకు సంబంధించిన పూర్తి వివరాలను సర్వే బృందాలకు వెల్లడించాలని కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు బూడిద పురుషోత్తం యాదవ్, నెల్లూరు నగరపాలక సంస్థ ఎఈ అర్చిత, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వై.శ్రీనివాసులు, వార్డ్ సచివాలయం అడ్మిన్ సయ్యద్ అబ్దుల్ జబ్బర్, టిపిబిఓ శివకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## మర్రిపాడులో ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన మర్రిపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఈ పరీక్షా కేంద్రానికి మండల పరిధిలోని మోడల్ స్కూల్, కస్తూరిబా గాంధీ విద్యాలయం, మర్రిపాడుతోపాటు అనంతసాగరం మండలంకు సంబంధించిన కళాశాల విద్యార్థులు హాజరయ్యారు. మొదటి రోజున ఈ పరీక్షా కేంద్రానికి 267మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా 248మంది విద్యార్థులు హాజరై 19మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. అయితే ఈ పరీక్షా కేంద్రానికి మొదటి రోజునే ఫ్లయింగ్ స్క్వాడ్ విష్ణు సందర్శించడం జరిగింది. మండలంలోని పలు గ్రామాల నుంచి విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రైవేటు వాహనాల్లో పరీక్షా కేంద్రానికి చేరుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

## సాగు, తాగునీరు సరఫరా పెంపు



**రాపూరు, మేజర్‌న్యూస్ :** ఉమ్మడి నెల్లూరు, చిత్తూరు జిల్లాలలో రైతాంగం కోసం సాగునీరు, చెన్నై మహానగరం ప్రజల తాగునీటి అవసరాల కోసం కండలేరు హెడ్ రెగ్యులేటర్ జీరో పాయింట్ నుండి విడుదల చేస్తున్న నీటి సరఫరాను సోమవారం నుండి పెంచడం జరిగిందని ఏఈఈడీ అనిలకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు తిరుగంగా ప్రాజెక్టు ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు జీరో పాయింట్ నుండి సాగు, తాగునీటి సరఫరాను పెంచినట్లు ఆయన తెలిపారు. తెలుగు గంగ ప్రాజెక్టు డివిజన్-1 ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఆదేశాల మేరకు సత్యసాయి గంగ కాలువ కాలువ ద్వారా నీటి విడుదలను 1,250 క్యూసెక్కుల నుండి 2,100 క్యూసెక్కులకు క్రమంగా పెంచడం జరుగుతోందని ఏఈఈడీ అనిలకుమార్ పేర్కొన్నారు. ఉమ్మడి నెల్లూరు, చిత్తూరు జిల్లాల ప్రస్తుత ఆయకట్టు సాగునీటి అవసరాలను తీర్చడంతో పాటు, చెన్నై నగర ప్రజల దాహార్తిని తీర్చేందుకు తాగునీటి నీటి సరఫరా విడుదల క్రమంగా పెంచడం జరుగుతుందని ఆయన తెలిపారు.

## ప్రకృతి వ్యవసాయం ద్వారా పండిన కూరగాయల స్టాల్ ఏర్పాటు



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన ఏఎస్ పేట ఎంపీడీవో కార్యాలయం వద్ద మండల ఫార్మర్ మాస్టర్ ట్రైనర్ పి.సుబ్బరాయుడు ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంలో పండిన కూరగాయాలను, ఆకుకూరలను, గడ్డ జాతి కూరలను ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో స్టాల్ ఏర్పాటు చేసి విక్రయించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ప్రసన్న కుమారి ప్రకృతి వ్యవసాయం ద్వారా పండిన కూరగాయల స్టాల్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నఎంపీడీవో ప్రసన్న కుమారి ఏవో రేణుకలు పలువురు మహిళలకు ఈ ఆరోగ్యకరమైన కూరగాయలను తినడం వలన ఆరోగ్యానికి మంచిదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వెలుగు సీసీలు సుభాషిని, మోబీన ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జి.తిరుపతి కే.లక్ష్మి, బీబీజాన్, పి.సుమతి పలువురు మహిళలు పాల్గొన్నారు.

# ఇంటి నివేశనస్థలాలు అన్యాక్రాంతం.. ఆర్డీఓకు ఫిర్యాదు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని నెల్లూరు–ముంబాయి జాతీయరహదారిపై టిడ్కోగృహసముదాయం సమీపంలో గతంలో ప్రభుత్వం తమకు ఇచ్చిన ఇంటినివేశనస్థలాలు అన్యాక్రాంతమవుతున్నాయని, వెంటనే చర్యలు తీసుకోవాలని, తమ స్థలాలు తమకు అప్పగించాలని పట్టణంలోని టైలర్లు, బీడీకార్మికులు కోరారు. రైతుసంఘ జిల్లా నాయకుడు లక్కు కృష్ణప్రసాద్, బీడీకార్మికసంఘ గౌరవాధ్యక్షుడు గోరీ సుల్తాన్‌ల ఆధ్వర్యంలో దాదాపు 60మంది టైలర్లు, బీడీ కార్మికులు సోమవారం స్తానిక ఆర్డీవో భూమిరెడ్డి పావనిని కలిసి వినతిపత్రం అందించడంతోపాటు వివరాలు తెలిపారు. 1986, 1990, 1996 సంవత్సరాల్లో 300 మంది టైలర్లు, బీడీకార్మికులకు 30అంకణాల వంతున ఇంటినివేశనస్థలాలు పట్టాలిచ్చారన్నారు. తమకు ఆర్థికస్థోమతలేక, పట్టణానికి దూరంగా ఉన్నందున ఇళ్ళ నిర్మాణాలు చేపట్టలేకపోయామన్నారు. కొందరు నిర్మాణాలు చేశారని, కొందరు పునాదులు నిర్మించారని వారు పేర్కొన్నారు. ఈ భూములు వాగుపోరంబోకుగా రికార్డుల్లో నమోదై ఉందన్నారు. ఇటీవల నెల్లూరుకు చెందిన పచ్చిపులుసు వెంకటేశ్వర్లు, మునగ సుజిత్‌కుమార్‌లు ఈ స్థలాలను లేఅవుట్‌లుగా మారుస్తున్నారని, వేలకొద్దీ టన్నుల మట్టిని 20ఎకరాల ప్రభుత్వ స్థలంలో తరలించి చుట్టూరా ప్రహరీగోడ నిర్మిస్తున్నారని వారు వివరించారు. తాము వారిని అడిగితే సర్వే చేయించుకోండి అంటూ సమాధానమిస్తున్నారని వారు పేర్కొన్నారు. ఈ భూములను ఆక్రమించుకొని లేఅవుట్లుగా వేస్తున్న పచ్చిపుసులు వెంకటేశ్వర్లు అన్యాక్రాంతం చేయడంపై సమగ్ర విచారణ జరపాలని, పేదలకు ఇచ్చిన స్థలాలను వారికిచెందేలా చర్యలు తీసుకోవాలని వారు ఆర్డీవోను కోరారు. తాను ఇరువైపులా ఉన్న ఆధారాలు, రికార్డులు పరిశీలించి తగు చర్యలు తీసుకుంటానని ఆర్డీవో పావని వారికి హామీ ఇచ్చారు.

# 27న వడ్డెర వృత్తిదారుల సమస్యలపై 'చలో అసెంబ్లీ'

- కులబాంధవులంతా భాగస్వాములై జయప్రదం చేయాలి
- ఏపీ వడ్డెరవృత్తిదారుల సంఘం రాష్ట్రకమిటీ పిలుపు

**నెల్లూరు/వేదాయపాలెం, మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలో వడ్డెర వృత్తిదారులు ఎదుర్కొంటున్న అనేక రకాల సమస్యలు అపరిష్కృతంగా ఉన్న న్యాయబద్ధమైన డిమాండ్ల సాధన కొరకు ఈనెల 27న చేపట్టనున్న చలో అసెంబ్లీ కార్యక్రమంలో యావన్మంది కుల బాంధవులంతా స్వచ్ఛందంగా భాగస్వాములై జయప్రదం చేయాలని ఏపీ వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం వారి విడుదల చేసిన ప్రకటనలోని వివరాలిలా ఉన్నాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్నప్పటికీ ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా అమలుకు నోచుకోకపోవడం అన్యాయమన్నారు. వడ్డెర వృత్తిదారులపై కక్ష గట్టిన దారులు నిరంతరం హత్యలు అత్యాచారాలు దాడులు దౌర్జన్యాల పరంపరను కొనసాగిస్తున్నారని, వీటి అరికట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చదు వుతూ వడ్డెర వృత్తిదారులకు సామాజిక రక్షణ చట్టాన్ని వర్తింపజేసి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 30లక్షల పైచిలుకు జనాభా కలిగిన వడ్డెరలలో 20 లక్షలమంది చేతి వృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్నారని, ఈ క్రమంలో బడా కాంట్రాక్టర్లు అధునాతన యంత్రాలను అందుబాటులోకి తెచ్చి పనులు చేయిస్తుండటంతో ఎందరో రుచిదారులకు పనులు లేక, పూటగడవని స్థితిలో ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని, ప్రభుత్వం స్పందించి ఒక్కొక్క కుటుంబానికి రూ.50వేల చొప్పున నగదు బదిలీ చేయాలని, ప్రభుత్వమే పనులు కల్పించాలని, వడ్డెర కార్పొరేషన్‌కు బడ్జెట్లో రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని, సదరు నిధులను వడ్డెర్ల అభివృద్ధి సంక్షేమాల కొరకు ఖర్చు చేయాలని, అదేవిధంగా గతంలో రిజిస్టర్ అయిన వడ్డెర సొసైటీలను వెంటనే పునరుద్ధరించాలని, 90శాతం రాయితీతో ఒక్కొక్క సొసైటీకి రూ.30లక్షల చొప్పున మంజూరు చేయాలని, వడ్డెర వృత్తిదారుల్లో వృత్తిపరమైన నైపుణ్యతను పెంపొందించడానికి ప్రతి జిల్లాలోనూ ఒక స్కిల్ డెవలప్ మెంట్ శిక్షణ కేంద్రాన్ని ప్రభుత్వమే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. క్వారీలు, మైన్లలో వడ్డెర్లకు 15శాతం రిజర్వేషన్ కల్పించేందుకు మంత్రి మండలిలో చర్చించిన మీదట ప్రత్యేక జీఓను తీసుకువస్తామని గత ఐదు నెలల క్రితం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పత్రికా ముఖంగా ప్రకటన చేసినప్పటికీ, ఇప్పటివరకు సదరు జీవో విడుదలకు నోచుకోకపోవడం బాధాకరమన్నారు. ఇలాంటి అనేక రకాలైన న్యాయబద్ధమైన డిమాండ్ల సాధన, సమస్యలకు పరిష్కారం కోరుతూ ఈనెల 27న చేపట్టనున్న చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# అంగన్‌వాడీల న్యాయమైన కోర్కెలు ఆమోదించాలి



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల న్యాయమైన కోర్కెలు ఆమోదించాలని, సమస్యలు పరిష్కరించాలని, పూర్తిసమయం కేటాయించి విధులు నిర్వహిస్తున్న అంగన్‌వాడీలను నిర్లక్ష్యం చేయడం ప్రభుత్వానికి తీగదని సిఐటియు నాయకులు పేర్కొన్నారు. డిమాండ్ల సాదనకోసం సిఐటియు అనుబంధ అంగన్‌వాడీ వర్కర్స్‌అండ్‌హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్రకమిటీ పిలుపు మేరకు సోమవారం ఆత్మకూరులోని ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట అంగన్ వాడీ కార్యకర్తలు సామూహికంగా రిలేనిరాహారదీక్షలు ప్రారంభించారు. శిబిరాన్ని సిఐటియు మండల శాఖ అధ్యక్షుడు ఆత్మకూరు నాగయ్య, జిల్లా నాయకుడు కొండమూరు హజరత్తయ్య, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్‌హెల్పర్స్ యూనియన్ ప్రధానకార్యదర్శి పి.రాధలు ప్రారంభించి ప్రసంగించారు. తమ ఉద్యమంలో భాగంగా సోమవారం రాష్ట్రంలోని అన్ని ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయాలవద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు, రిలేదీక్షలు నిర్వహించారని, 24వతేదీన అంగన్‌వాడీ సహాయకులు రిలేనిరాహారదీక్షలు నిర్వహించనున్నారని, 25వతేదీన జిల్లాలోని ఐసిడిఎస్ కార్యాలయాలవద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు, 26వతేదీన అంగన్‌వాడీ సహాయకులు రిలేదీక్షలు నిర్వహించనున్నారని, 27వతేదీన కలెక్టరేట్ల ఎదుట రిలేదీక్షలు నిర్వహించనున్నారని, మార్చి1వతేదీ ఛలో విజయవాడ కార్యక్రమం చేపట్టి 2వతేదీన విజయవాడలో మహాధర్నా నిర్వహించేలా రాష్ట్ర సిఐటియు అనుబంధ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కమిటీ నిర్ణయించగా ఈమేరకు రిలేదీక్షలు ప్రారంభించామని వారు తెలిపారు. ఆత్మకూరు ప్రాజెక్టుపరిధిలోని ఆత్మకూరు అర్బన్, రూరల్, ఏఎస్‌పేట, చేజర్ల,సంగం మండలాలకు చెందిన వందలాదిమంది అంగన్‌వాడీ కార్యకర్తలు రిలేదీక్షల్లో పాల్గొనగా నాయకులు నాగయ్య, హజరత్తయ్య, రాధ అధ్యక్షురాలు కె.రమణమ్మలు ప్రసంగించారు. పూర్తి సమయం కేటాయించి చిన్నారులకు పూర్వప్రాథమిక విద్యను అందిస్తూ గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తూ వారి ఆరో గ్యం పట్ల జాగ్రత్తలు తీసుకుంటున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు కనీసవేతనాలు కూడా లభించడంలేదంటూ గతంలో అనేక పోరాటాలు చేశామని, 43రోజుల పాటు నిరవధిక సమ్మె కూడా చేశామని, నాడు వైసిపి పాలకులు తూతూ మంత్రపు హామీలిచ్చి సమ్మె విరమింపజేశామని, వేతనాలు పెంచలేదని, ఆనాటి సమ్మె సందర్భంగా అప్పటి ప్రతిపక్షనేతలు, నేటి పాలకులు చంద్రబాబు, నారా లోకేష్ తదితరులు అంగన్‌వాడీలకు తాము అధికారంలోకి వచ్చాక న్యాయం చేస్తామని హామీఇచ్చినా నేటికి అతీగతీ లేదని వారు పేర్కొన్నారు. దాంతో మళ్ళీ ఉద్యమం అనివార్యమైందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీల వేతనాలు పెంచాలని, 26వేల రూపాయల కనీసవేతనాలివ్వాలని, మినీఅంగన్‌వాడీలను మెయిన్‌లుగా మార్చాలని, పెన్షన్ అమలు చేయాలని, గ్రాట్యుటి ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ప్రభుత్వ సంక్షేమపథకాలు వర్తింపజేయాలని, రిటైర్‌మెంట్‌బెనిఫిట్ 5లక్షల రూపాయలకు పెంచాలని, అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకురాలు ఎవరైనా మరణిస్తే ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని, యాప్‌లబెడద తొలగించి ఒకే యాప్ అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్‌అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ఆర్.సుప్రజ, ఎస్.విజయమ్మ, ఏ.మస్తానమ్మ, జి.పద్మావతి, కె.విజయలక్ష్మి, పి.సావిత్రి, డి.పుష్పకళ, సి.హెచ్ రూతమ్మ, ఎస్.భారతి, డి.కుసుమ, భాగ్యలక్ష్మి, జమీలా, ఆత్మకూరు, ఏఎస్‌పేట, సంగం,చేజర్ల మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు న్యాయవాదుల కోర్టు విధుల బహిష్కరణ

**నెల్లూరు లీగల్, మేజర్‌న్యూస్ :** కర్నూలు న్యాయవాది పవన్ కుమార్‌పై కర్నూలు 4వ నగర పట్టణ సీఐ జరిపిన అమానుష దాడిని ఖండిస్తూ నెల్లూరు న్యాయవాదులు మంగళవారం కోర్టు విధులను బహిష్కరించాలని నిర్ణయించారు. ఈ మేరకు నెల్లూరు బార్ అసోసియేషన్ హాల్లో సోమవారం జరిగిన అత్యవసర ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో కర్నూల్ న్యాయవాదిపై జరిగిన దాడిని ఖండిస్తూ కర్నూల్ న్యాయవాదుల ఆందోళనకు మద్దతుగా కోర్టు విధులు బహిష్కరించాలని నిర్ణయించారు. కర్నూలు పోలీసు సిఐ న్యాయవాది పవన్ కుమార్‌పై జరిపిన దాడిని నెల్లూరు బార్ అసోసియేషన్ ఖండించింది. కోర్టు విధుల బహిష్కరణకు న్యాయవాదులు సహకరించాలని నెల్లూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పులిమి అయ్యప్పరెడ్డి, జనరల్ సెక్రెటరీ నాగరాజు కోరారు.

## కోడి పందాలపై పోలీస్ దాడులు

- 8మంది, 21మోటార్ సైకిల్స్ 5కోడి పుంజులు స్వాధీనం

**మనుబోలు, మేజర్‌న్యూస్ :** మండలంలోని బద్దెవోలు పంచాయతీ పల్లెపాలెం పొలాలలో కోడిపందెం నిర్వహిస్తున్న వారిని ఎస్ఐ శివ రాకేష్ తన సిబ్బంది తోవెళ్లి వలపన్ని పట్టుకున్నారు. పల్లెపాలెం గ్రామానికి దక్షిణంగా బీడు పొలాల్లో కోడిపందాలు జరుగుతున్న విషయాన్ని తెలుసుకున్న ఎస్ఐ శివరాకేష్ సిబ్బందితో వెళ్లి పట్టుకున్నారు. ఈ దాడుల్లో మీడియాకు సోమవారం సాయంత్రం ప్రకటన విడుదల చేశారు. వీరిని వీటిని కోర్టుకు హాజరు పరుస్తామని చెప్పారు.

## 8 మంది పేకాటరాయుళ్లు అరెస్ట్

**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మండలంలోని తిక్కవరం గ్రామ శివారులో పేకాట స్థావరాలపై పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో 8మందిని అదుపు లోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి నట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. నిందితులనుంచి 21,910 నగదు, 8 మొబైల్ ఫోన్‌లను స్వాధీనపరుచుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. పేకాట స్థావరంపై ముందస్తు సమాచారంతో దాడులు చేసినట్లు ఆయన తెలిపారు.

## సాగు భూములను ఆన్‌లైన్ చేస్తూ
# పాసు పుస్తకాలు ఇవ్వండి



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** తాము సాగు చేసుకుంటున్న భూములను ఆన్ లైన్ చేస్తూ పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయాలని శీతారెడ్డి తోపు భూముల సాగుదారులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం సిపిఎం, వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్త ఆధ్వర్యంలో సాగుదారులు తహసిల్దార్ స్వప్న ను కలసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు వచ్చినప్పుడు ఈ రెండు అంశాలను పరిశీలిస్తామని తహసిల్దార్ సమాధానం చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అంకయ్య, వ్యవసాయ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నక్కారాదయ్య, మస్తాన్ షా తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్షలకు 174మంది హాజరు

**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం సోమవారం నిర్వహించిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు విద్యార్థిని విద్యార్థులు హాజరయ్యారు. మండల కేంద్రం గురుకుల పాఠశాల పరీక్షా కేంద్రంగా ఏర్పాటు చేశారు. 178మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావలసి ఉండగా నలుగురు గైర్హాజరైనారు. స్థానిక పోలీస్ శాఖ ఉన్నతాధికారులు బందోబస్తు నిర్వహించారు.

## ప్రశాంతంగా జరిగిన ఇంటర్ పరీక్షలు

**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని డిఎల్ఎన్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రారంభమైన ప్రథమ సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షలు తొలి రోజైన సోమవారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 8:30 నిమిషాలకే విద్యార్థులు పరీక్ష కేంద్రానికి చేరుకుని తమ హాల్ టికెట్లను సరి చూసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, మాస్ కాపీయింగ్ జరగకుండా అధికారులు గట్టి చర్యలు తీసుకున్నారు.

# వేల కళ్ళకు వెలుగులు నింపిన ప్రదాతలు వేమిరెడ్డి దంపతులు

## వేమిరెడ్డి దంపతులకు గూడా కృతజ్ఞతలు



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** మండలంలో ఇప్పటివరకు అనేక వేల కళ్ళకు వెలుగులు నింపిన విపిఆర్ నేత్ర వాహన వైద్య సేవలు సోమవారంతో జనార్ధనపురం శిబిరంతో ముగిశాయివేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో విపిఆర్ నేత్ర ద్వారా నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరాలు జనార్ధనపురం గ్రామంతో ముగిసాయి. నేత్ర శిబిరం ముగింపు సందర్భంగా తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ కూడా నర్సారెడ్డి శిబిరాన్ని సందర్శించి మాట్లాడుతూ.. పేదల కళ్ళల్లో వెలుగుల నింపడమే విపిఆర్ ఫౌండేషన్ చేపట్టిన విపిఆర్ నేత్ర ఉచిత కంటి వైద్య శిబిరాలు వింజమూరు మండలంలో అఖండ విజయాన్ని సాధించి, మండలంలో 12 పంచాయతీలలో 19 రోజులపాటు నిర్వహించరన్నారు. మండలంలో సుమారుగా 6476మందికి అధునాతనమైన పరికరాలతో కంటి పరీక్షలు నిర్వహించి దృష్టిలోపంతో బాధపడుతున్న 3637 మందికి ఉచితంగా కళ్ళ జోళ్లను అందజేశారన్నారు. ఇంతటి బృహత్తర కరమైన కార్యక్రమాన్ని చేపట్టిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డికి మండల ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు మండలంలో అనేక మంది సుదూర ప్రాంతాలకు వెళ్లి కంటి పరీక్షలు చేయించుకోలేని నిరుపేదలకు ఖరీదైన కంటి పరీక్షలు చేసి అద్దాలను ఉచితంగా అందించడం వేమిరెడ్డి దంపతుల సేవానిరతికి నిదర్శనం అని కొనియాడారు. ఇలాంటి నేతలు మన జిల్లాకు రావడం ఈ జిల్లా ప్రజల అదృష్ట మనీ తెలిపారు అంతేకాకుండా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదేశాలతో మండలంలోని పలు పంచాయతీల కూటమి నాయకులు ఆయా ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించి వైద్య శిబిరాన్ని సద్వినియోగపరచుకునే విధంగా కృషి చేసిన మండల నేతలు అందరికీ కూడా ధన్యవాదాలు తెలియజేశారు.

## ఇంటర్ పరీక్షలకు 181 మంది హాజరు



**రాపూరు, మేజర్‌న్యూస్ :** ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమైన తొలిరోజు మొదటి సంవత్సరం పరీక్షలకు 181 మంది విద్యార్థినీ విద్యార్థులు హాజరయ్యారని సిబికే ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పరీక్షల చీఫ్ సూపర్నెంటెండ్ బి.కృష్ణవేణి తెలిపారు. మొదటి సంవత్సరం పరీక్షలు 194 మంది రాయాల్సి ఉండగా అందులో 13మంది హాజరు కాలేదని అదేవిధంగా మొదటి సంవత్సరం ఒకేషనల్‌కు సంబంధించి 18మంది పరీక్షలు రాయాల్సి ఉండగా ఇద్దరు హాజరు కాలేదని తెలిపారు. తొలిరోజు ఎటువంటి మాల్ ప్రాక్టీస్ జరగలేదని ఆమె తెలిపారు. ఇంటర్మీడియట్ పరీక్షల నేపథ్యంలో విద్యార్థినీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పరీక్షా కేంద్రంకు చేరుకోవడంతో సందడి నెలకొంది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా స్థానిక పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

## వీఎస్‌యులో ఐఎస్ఓ తనిఖీలు

**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో సోమవారం అంతర్జాతీయ నాణ్యతా ధృవీకరణలో భాగంగా ఐఎస్ఓ ప్రతినిధుల బృందం సమగ్ర తనిఖీలు నిర్వహించింది. రిజిస్ట్రార్ డా. కె.సునీతతో సమావేశమై నాణ్యతా విధానాలు, అకాడమిక్ ప్రణాళికలు, పరిపాలనా పారదర్శకతపై సమీక్షించారు. మెరైన్ బయాలజీ, ఫుడ్ టెక్నాలజీ, బయోటెక్నాలజీ, పరీక్షల విభాగం, గ్రంథాలయాన్ని సందర్శించి ల్యాబ్ సదుపాయాలు, డిజిటల్ మూల్యాంకనం, ఈ-వనరులు తదితర అంశాలను పరిశీలించారు. అంతర్జాతీయ గుర్తింపు సాధనలో తనిఖీలు కీలక మైలురాయిగా నిలుస్తాయని విశ్వవిద్యాలయ అధికారులు తెలిపారు.

## పీజీఆర్ఎస్‌లో పాల్గొన్న తహసీల్దార్



**రాపూరు, మేజర్‌న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కార వేదిక పీజీఆర్ఎస్ కార్యక్రమం సోమవారం రాపూరు తహసీల్దార్ కార్యాలయంలో జరిగింది. ఈ నేపథ్యంలో తహసిల్దారు లక్ష్మీనరసింహం ప్రజల నుండి వినతి పత్రాలు సేకరించి తమ పరిధిలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించారు. వెంటనే పరిష్కారం కానీ సమస్యలకు తగు సూచనలు సలహాలు తెలియజేసి పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలను జిల్లా ఉన్నతాధికారులకు పంపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్తు ఏవో దశరథ రామిరెడ్డి ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నీ కుట్రలు సాగవు కాకాణి.. : టీడీపీ నాయకులు

**మనుబోలు, మేజర్‌న్యూస్ :** మాజీ మంత్రి నెల్లూరు జిల్లా అధ్యక్షులు కాకాని గోవర్ధన్‌రెడ్డి చేసే కుట్రలు సాగనివ్వమని తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సొసైటీ చైర్మన్ పొన్నూరు రామకృష్ణయ్య వార్నింగ్ ఇచ్చారు. మండల కేంద్రమైన మనుబోలు కోదండ రామ పురం సిఆర్ఆర్ కళ్యాణమండపంలో సోమవారం ఉదయం మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి ఆదివారం పొట్టేలు కలవ వద్దచేసిన ఆరోపణలు మాట్లాడిన తీరుకు టిడిపి శ్రేణులు సోమవారం కౌంటర్ ఇచ్చారు. కౌంటర్‌లో భాగంగా ముందుగా అధ్యక్షులు పొన్నూరు రామకృష్ణ మాట్లాడుతూ.. కాకాని గోవర్ధన్ రెడ్డి మాటలను చర్యలను ఎండగట్టారు. మా ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పైన కాకాని చేస్తున్న ఆరోపణలను తిప్పి గొట్టారు. పొట్టేళ్ల కాలువ చెక్ డాం దగ్గరకు వచ్చి ఎమ్మెల్యే కోట్లు తినేశాడని కాకాణ్ణి మాట్లాడారని ఇది ఎంత దారుణం అంటే స్టేట్ డిజస్టర్ ఫండ్ మేనేజ్మెంట్ మా టీడీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత చేసుకున్న బిల్లులు రూ.2కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. మా కార్యకర్తలు నాయకులు కాలువలు రిపేర్లు చేస్తే వాళ్లను నాశనం చేయాలని కాకాని కుట్ర పూరిత ఆరోపణలు చేస్తున్నాడని పొన్నూరు రామకృష్ణయ్య ఆరోపించారు. కనుపూరు కాలువ సర్వే పల్లి కాలవలకు ఏడు కోట్లు దొంగ బిల్లులు పెట్టుకుని డ్రా చేసుకునేందుకు కాకాని కోర్టుకు వెళ్లి తెచ్చుకున్నాడని ఆ బిల్లు ఇప్పుడు విడుదలయితే టిడిపి ప్రభుత్వంలో అక్రమాలు జరిగాయనే మాపైన అబండాలు వేయడానికి కాకానికి గోవర్ధన్ రెడ్డికుట్రలో ప్రయత్నమే ఇది అని పొన్నూరు రామకృష్ణయ్య చెప్పారు. వాళ్ల దొంగ బిల్లులు చేసుకుని మా పైన అబండాలు వేసే ప్రయత్నం ఏమిటని ఇలాంటి ప్రయత్నాలను తిప్పికొడతామని చెప్పారు. ఇక జగనన్న కాలనీలో వైకాపా ప్రభుత్వంలో పదివేలతో బేస్ మట్రాలు నిర్మించి రూ.70వేలు బిల్లు తీసుకున్నారని పొన్నూరు రామకృష్ణయ్య తెలిపారు. ఇపుడు ఆ బిల్లులు క్లియర్ కావాలని దానికి కూడా సోమిరెడ్డి అడ్డు పడుతున్నాడనే చెప్పే ప్రయత్నం కాకాణి పూను కుంటాడని పొన్నూరు తెలిపారు మా ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తెలుగు గంగ జలాశయంలో 10.30 టీఎంసీలు నీళ్లు ఉంటే ఆరుతడి పంటలుకు సాగు నీరు ఇప్పించి పండించిన గొప్ప నాయకుడని రామకృష్ణ య్య కితాబునిచ్చారు. అదే నువ్వు మంత్రిగా ఉండి 16 టీఎంసీలు నీళ్లు ఉంటే నార్లు పోయొద్దని చేతులెత్తేసావాని రామకృష్ణయ్య మండిపడ్డారు. 84 రోజులు జైల్లో ఉన్న జీవితంలో మార్పు లేదని, ఇలాగే ఆవాకులు చవాకులు పేలితే తీవ్ర పరిణామాలు ఉంటాయని వార్నింగ్ ఇచ్చారు. ఏంసి చైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నావు మా నాయకుడు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి విదేశాల్లో 1000 కోట్లు ఆస్తులు ఉన్నాయని ఆరోపించావు. మీ ప్రభుత్వంలో నిరూపించలేకపోయావు మీ అత్తగారు వాయిలేటిపాడులో దళితుల భూమి నాలుగున్నర ఎకరా కొట్టేశావు. నీ పొలాలని నిరూపించుకోలేకపోయావు. నీటి సంఘం అధ్యక్షులు ఒక్క రూపాయి బిల్లు రాలేదు టెక్నికల్ మంజూరు కూడా కాలేదు అప్పుడే మా ఎమ్మెల్యే చంద్రమోహన్‌రెడ్డి కోట్ల రూపాయలు తిన్నాడని ఆవాకులు చవాకులు మాట్లాడుతున్నావు.. తిన్నది నువ్వు అక్రమాలు చేసింది నువ్వు 85రోజులు జైల్లో దేనికున్నావు ఏమి చెస్తే జైలుకు వెల్లావు. తప్పు చేసి జైలుకు పోయింది నువ్వు.. మా నాయకుడు చంద్రమోహన్‌రెడ్డి 2029 సంవత్సరంలో మళ్ళీ చిత్తుచిత్తుగా నన్ను ఓడిస్తాడు అంటూ గాలి రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. అసత్యాలు మాట్లాడితే బాగుండదు. సాగు నీరు రావని 2017 సంవత్సరంలో గ్రామాల్లో దండోర వేయించావు అదే మా నాయకుడు పొలాలకు నీళ్లు ఇచ్చి పంటలు పండించాడని గుర్తు చేశారు. కనుపూరు కాల్వ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ వర్దినేని మస్తాన్ నాయుడు మాట్లాడుతూ.. సాగు నీటి ఏద్దడి దృష్టిలో పెట్టుకుని పొట్టేలు కాలువ నుండి లిఫ్ట్ ద్వారా నీరు ఇచ్చే ప్రయత్నాలు చేస్తుంటే లేనిపోని ఆరోపణలు చేస్తున్నావు. రాజోలు పాడు గ్రామంలో ఐదు సంవత్సరాల క్రితం జరిగిన విషయాన్ని ఆరోపణలుఇప్పుడు చేయడం తగదని ఆనాడు లిఫ్ట్ ద్వారా నీళ్లు ఇవ్వకపోతే రైతులు ఆనాడు పంటలు పండించుకునే పరిస్థితి లేదని ఈ విషయాన్ని గోవర్ధన్ రెడ్డి తెలుసుకోవాలని. చెప్పారు. 2019 నుండి 2024 మధ్యలో అక్కంపేట చెరువులో 16లక్షలు కొమ్మలపూడి పొట్టేల కాలువ 24లక్షల్లో జేసీబీ పెట్టకుండానే బిల్లులు చేసుకున్న ఘనుడవని మస్తాన్ నాయుడు ఆరోపించారు కనుపూరు కాలువలో రెండు కోట్లు బిల్లు రావాల్సి ఉంటే ఒక కోటి విడుదలయని మస్తాన్ నాయుడు చెప్పారు. అసలు కాలువలు రిపేర్లకు ఎమ్మెల్యేకి ఏం సంబంధం అని మస్తాన్ నాయుడు ప్రశ్నించారు. రైతులు నీటి సంఘం అధ్యక్షులు చైర్మన్లు అయితే ఎమ్మెల్యేని పైన అబండాలు వేయడం ఏమిటని మస్తాన్ నాయుడు నిలదీశారు. మీకు ఎలాంటి అనుమానం ఉన్న మీ వాళ్ళని పంపిస్తే నిరూపిస్తామని మస్తాన్ నాయుడు తెలిపారు. తెలుగు యువత అధ్యక్షులు శివుడు, రాజాగౌడ్ మాట్లాడుతూ.. కాకాని నువ్వు వ్యభిచారి లాగా మాట్లాడుతన్నావని విమర్శించారు. మా ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నీతి న్యాయం ధర్మం అంటూ మమ్మల్ని నివారిస్తున్నాడని లేకుంటే నియోజకవర్గంలో తెలుగు యువత నీ ఇల్లు ముట్టడి చేసే వాళ్ళమని ఒళ్ళు దగ్గర పెట్టుకుని మాట్లాడమంటూ



రాజా గౌడ్ మాస్ వార్నింగ్ ఇచ్చారు. నీ చరిత్ర అందరికీ తెలుసు అని నకిలీ పత్రాలు నకిలీ మద్యం కేసులు ఇరుక్కున్న ఘనుడు అని ఆరోపించారు. గ్రీన్ కంట్రీ వద్ద 2024 పొలాల్లో ఎల్లవు గురైతే 20 ఎకరాలు పంటపాచి పోతే విత్తనాలు కూడా ఇవ్వలేని నువ్వు మా నాయకుడిని విమర్శించడం తగధని కాగితాల పూరు నీటి సంఘం అధ్యక్షులు వెడిచర్ల వెంకటరమణారెడ్డి ఖండించారు. 2018 సంవత్సరంలో కాగితాలపూరు గ్రామాల్లో రెండు దపాలు పూర్తిగా ఎండిపోతే ఆరోజు నువ్వు ఎమ్మెల్యే ఉండి కూడా ఏమీ చేయలేకపోయావని పంట చివరి దశలో కూడా నీళ్లు ఇవ్వలేని పరిస్థితిలో నువ్వు ఉన్నావని రమణారెడ్డి విమర్శించారు. మనుబోలు చెరువు పిడూరు చెరువు పూర్తిగా నిండితేనే సైపన్ల ద్వారా నీళ్లు మా గ్రామాల చెరువులుకు వస్తాయని విషయాన్ని తెలుసుకోకుండా మాట్లాడటం తగదని రమణారెడ్డి హితవు చెప్పారు. వైసిపి నాయకులు మీరు అడగండి మేము చేసే పని అక్రమైతే సక్రమంగా లేకపోవడం అన్యాయం అయితే దేనికైనా సిద్ధమని బురదజల్లే మాటలు వద్దని రమణారెడ్డి వారించారు. డ్యామ్‌లో నీళ్లు ఉంటే ఇక్కడ రెండు చెరువు నిండితేనే సైఫెన్ ద్వారా నీళ్లు వస్తాయని నెల టైం పడుతుందని ఈ విషయం మీకు అర్థం కాకపోవడం ఏమిటని తెలుసుకొని మాట్లాడాలని రమణారెడ్డివిజ్ఞప్తి చేశారు. మా ఎమ్మెల్యే చంద్రమోహన్ రెడ్డికృషి తోనే మా పంటలు పండించుకునే ప్రయత్నం చేస్తున్నామని లిఫ్ట్ లో నిధులు స్వాహా చేయలేదని రమణారెడ్డి ఖండించారు. ఇకమీదట ప్రతి విషయం తెలుసుకొని మాట్లాడాలని రమణారెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ ప్రెస్ మీట్‌లో టిడిపి నాయకులు, ముంగర విజీలు రెడ్డి, సాని వెంకట రమణయ్య, కిరణ్, మాట్లాడారు. మాజి సర్పంచ్ వెందోటి భాస్కర్ రెడ్డి(జట్ల కొండూరు)రవి రెడ్డి, ఏళ్ల యానాది నాయుడు, (రాజోలు పాడు )రావుల జీతేంద్ర, గుంజి సతీష్ (యాచవరం) తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధిలో.. గత ఏపీఓ చంద్రయ్య అభయం

# టీఏల హామీ పథకం !

### మండలంలో ఉపాధిహామీలో ఎక్కడ చూసినా అవినీతిమయం



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిరుపేదల కోసం ప్రవేశపెట్టింది. ఈ పథకంలో అవినీతి ఉండడంతో ఉపాధిలో పని చేయించే ఫీల్డ్ అసిస్టెంట్ నుండి టిఏలు ఏపీవోలు దాకా వారే తిమింగలంగా మారారని తీవ్ర ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. సైదాపురం మండలంలోని పలు పంచాయతీలలో జరిగిన ఉపాధి కోట్ల హామీ గ్రామసభ సామాజిక తనిఖీల్లో అన్ని అక్రమాలే చోటు చేసుకున్నాయి. మండలంలో 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు మండలం మొత్తానికి తొమ్మిది కోట్లు రూపాయలు పైన వివిధ పనులకు ప్రభుత్వం ఖర్చు చేసింది. 17వ విడత ఉపాధి హామీ సామాజిక తనిఖీల్లో భాగంగా ఒక్క ఎస్ఆర్పీ నలుగురు, డిఆర్పిలు గత పది రోజుల నుండి ఆయా గ్రామాలలో తనిఖీలు నిర్వహించి గ్రామసభలు నిర్వహిస్తున్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం గ్రామలలో కూలి చేసుకుంటూ గతంలో కట్టెలు కొట్టి జీవనం సాగిస్తున్న ఆ నిరుపేదల కోసం ప్రభుత్వాలు వారి బ్రతుకులలో వెలుగు చూడాలని ఉద్దేశంతో ఉపాధిహామీని ప్రవేశపెట్టింది. మండలంలో ఉపాధి తనిఖీలు చేస్తున్నప్పటికీ వారెవ్వర్నీ కూడా తెలియపరచకుండా ఎవరికి తెలియకుండా గుట్టు సప్పుడుగా ఈ తనిఖిలు నిర్వహిస్తూ ఎవరికి తెలియకుండా గ్రామ సభలు నిర్వహిస్తూ కనీసం గ్రామంలో గ్రామ సభ పెడుతున్నామని ఆ గ్రామంలో ప్రజలకు ప్రజలకు తెలిసేలా దండోరా వేయకుండా పకడ్బందీగా ఈ గ్రామసభలు నిర్వహిస్తూ ఉండడంతో మండలంలోని ప్రజలు ఇది ఎంతవరకు న్యాయమని ఏ విషయమైనా అందరికీ తెలిసేలా గ్రామసభ నిర్వహించాలని ఆ గ్రామసభలో ముఖ్య సభ్యులుగా పంచాయతీ కార్యదర్శి మరియు గ్రామస్తులు అందరూ కలుసుకొని గ్రామ సభనిర్వహించడం జరుగుతుంది. సోమవారం పాలూరు పంచాయతీలో జరిగిన గ్రామసభలో పంచాయతీలో మొత్తం 59పనులు జరగగా అందుకు అయినటువంటి ఖర్చు 37,48,052 రూపాయలు ఇవ్వడం జరిగింది. అయితే పాలూరు గ్రామంలో మొత్తం 360 ఉపాధి హామీ కార్డులు ఉంటే అందులో పని చేయడానికి వచ్చిన వారు 305 మంది డిఆర్పిలు ఇంటి ఇంటికి తిరిగి చేసిన సర్వేలో కూలీలను సంప్రదించింది 241 గ్రామసభ నిర్వహించింది మాత్రం ఓ పదిమందితో గ్రామసభ నిర్వహించబడింది.

**గుట్టు చప్పుడు కాకుండా గ్రామసభలు**

మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో 17వ విడత ఉపాధి హామీ సామాజిక తనిఖీల్లో భాగంగా ఉపాధి హామీ 2024-25లో చేసిన పనులకు గాను ఆడిట్ చేయడానికి వచ్చిన సోషల్ ఆడిట్ అధికారులు కనీసం ప్రస్తుతం ఉన్నటువంటి ఎంపీడీవో ఎం.రామ్మోహన్‌రెడ్డికి, ప్రస్తుతం ఉన్నటువంటి ఏపీవో సురేంద్రబాబుకి సమాచారం లేకుండానే 10 గ్రామా లలో సోషల్ ఆడిట్ అధికారులు గుట్టు చప్పుడు కాకుండా తనిఖీలు నిర్వ హించి గ్రామసభలు పెట్టామని తెలియజేయడం గమనార్హం మండల పరి షత్ అభివృద్ధి అధికారికి కనీసం మాట కూడా తెలుపకుండా గత ఏపీవో చంద్రయ్య, టిఏలు, గుట్టు చప్పుడు కాకుండా ఎవరికి తెలియకుండా సీక్రెట్గా తనిఖీలు చేసి కనీసం గ్రామాలలో దండోరా వేయకుండా గ్రామ సభకు ఐదు,పది మందితో గ్రామసభలు నిర్వహించడం ఎంతవరకు కరెక్ట్ అని మండల ప్రజలు పలు రకాలుగా విమర్శించుకుంటున్నారు.

**ఉపాధిహామీని అవినీతి హామీగా మార్చిన సిబ్బంది**

సైదాపురం మండలంలో జరిగిన ఉపాధి హామీలో భారీ అవినీతి జరిగింది అనడానికి మండలంలోని టీఏలు పంచాయతీలలో జరిగినటువంటి పనులకు సంబంధించి ఫీల్డ్ వర్క్‌లో మాస్టర్లు వేయకుండానే ఏపీవో ఈసీ సంతకాలు లేకుండానే బిల్లులు వేయడం అంతేకాకుండా టీఏలు అవినీతితో ముడిపడి మస్టర్లో ఎవరు పేర్లు ఉన్నాయో తెలియకుండా చనిపోయిన వారి పేర్లు అంతే కాకుండా మిడ్ డే మీల్స్ వర్క్ చేసుకున్నటువంటి వారి పేర్లు పెట్టడం వారి మీద బిల్లులు చెల్లించడం వంటివి భారీగా మండలంలో జరిగినటువంటి దాకాలు ఎన్నో ఉన్నాయి. ప్రస్తుతం గమనించినటువంటి విషయాల్లో పాలూరు గ్రామంలో రాగిపాటి ఈశ్వరమ్మ అనే మహిళ చనిపోయి చానా రోజులైనప్పటికీ, చెరువు వర్క పనిలో రాగిపాటి ఈశ్వరమ్మ జాబ్‌కార్డ్ నెంబర్ ఏపీ09033030035010165పై పనిచేసినట్టు చూపించి ఏడు రోజులకు 1562 రూపా యలు చెల్లించారు. అంతేకాకుండా హౌసింగ్‌కు సంబంధించి ఒకే ఇంటికి రెండు ఐడికార్డులు చేయడం జరిగింది. వర్క్ ఐడి నంబర్ 0209033030 ఐఎఫ్‌జీఐఎస్ 1281246 దీనికి 8160 రూపాయలు చెల్లించారు. అదేవిధంగా ఐఎఫ్‌జీఐఎస్ 1281240 రూ.5440 రూపాయలు చెల్లించారు. మరో రెండు కాలువల వరకల పనికి సంబంధించి 53391 చెల్లించారు. అయితే ఈ కాలువల కొలతలు అన్నీ కూడా తేడాగా ఉండడం ఉండడం గమనార్హం. అదేవిధంగా పీటీ వర్కులకు సంబంధించి రూ.1,10,255 రూపాయలు చెల్లించారు కానీ ఇవి కూడా కొలతలు తేడా ఉన్నాయని డిఆర్పీలు నిర్ధారించారు. అంతేకాకుండా ఆర్ట్ కల్చర్ కింద మూడు వర్కులు చేయడం జరిగింది. టి.సుజాత రైతు ఐడి నెంబర్ 0209033030 ఐఎఫ్‌జీఐఎస్ 688954 దీనికి సంబంధించి 16,700 రూపాయలు చెల్లించారు. అయితే అక్కడ నిమ్మ మొక్కలు ఏమీ కూడా లేవు. టి.మస్తానయ్య రైతు ఐడి ఐఎఫ్‌జీఐఎస్ 1323786 నంబర్ మీద రూజ.19,725 రూపాయలు చెల్లించారు. అక్కడ పొలంలో మాత్రం నిమ్మమొక్కలు కూడా లేవు. ప్రసాద్ రాజు అనే రైతు ఐడి రూ.6,88,898 చెల్లించారు. కానీ ఆ పొలంలో నిమ్మ మొక్కలు లేవు, ఇదంతా ఒక ఎత్తైతే కాలువ వర్క్ ఐడి 1648236పై రూ.23,700 చెల్లించారు. ఈ వర్క్‌కు సంబంధించి ఎటువంటి ఆసాదర్ లేకుండా బిల్లులు మంజూరు చేయడం జరిగిందని డిఆర్పి శివకుమార్ తెలుపుతూ పీటీ వర్క్‌లో అదనంగా 948 చెల్లించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఓగ్గు కుమార్‌స్వామి, టీఏ అన్నపూర్ణ, డీఆర్‌పీ శివకుమార్, టీడీపీ నాయకులు మునియనాయుడు, నరసప్ప నాయుడు యామసనేని సుబ్రం నాయుడు, కూలీలు పాల్గొన్నారు.

## నగరాన్ని హరితవనంగా తీర్చిదిద్దడమే లక్ష్యం : ఇన్‌చార్జ్ మేయర్

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరాన్ని పచ్చదనంతో హరితవనంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అభివృద్ధి పనులను చేపడుతున్నామని నగరపాలక సంస్థ ఇన్‌చార్జ్ మేయర్ రూప్ కుమార్ యాదవ్ తెలిపారు. నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్‌తో కలిసి స్థానిక 50వ డివిజన్ సంతపేట పేరంటాలమ్మ గుడి సమీపంలో జరుగుతున్న మొక్కలు నాటే కార్యక్రమంలో ఇన్‌చార్జ్ మేయర్ సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్చి 5న జరిగే రంగనాయకులపేట తల్పగిరి రంగనాథ స్వామి రథోత్సవం సందర్భంగా రథం తిరిగే రోడ్లపై ఎలాంటి గుంతలు లేకుండా అన్ని ప్రాంతాలలో 5 లక్షల రూపాయలతో ప్యాచ్ వర్క్ పనులు చేస్తున్నామని, ఎండ్ టు ఎండ్ సిసి రోడ్ల నిర్మాణ పనులను 30 లక్షల రూపాయలతో చేపట్టామని తెలిపారు. డివిజన్ వ్యాప్తంగా పచ్చదనం పెంచడం కోసం 10లక్షల రూపాయలతో మొక్కలను నాటి సంరక్షించే బాధ్యతలు కూడా చేపడుతున్నామని ఇన్‌చార్జ్ మేయర్ ప్రకటించారు. కమిషనర్ వైఓ నందన్ మాట్లాడుతూ.. మంత్రి డాక్టర్ పి.నారాయణ ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని ప్రాంతాలలో ప్రతి ఐదు మీటర్లకు ఒక మొక్కను నాటి సంరక్షించే బాధ్యతలను చేపట్టనున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా తమ పరిధిలోని మొక్కలను



స్వచ్ఛందంగా సంరక్షించే బాధ్యతలను చేపట్టాలని కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కప్పిర శ్రీనివాసులు, రేవతి, బాష, కూటమి నాయకులు, నగరపాలక సంస్థ వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ఇంచార్జ్ మేయర్ స్థానిక మూడవ డివిజన్ ప్రాంతంలో జరుగుతున్న మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సంక్రాంతి కళ్యాణ్, మున్సిపల్ మాజీ చైర్మన్ తాళ్ళపాక అనురాధ, నాయకులు రమణయ్య, నారాయణరెడ్డి, శ్రీలక్ష్మి, మామిడాల మధు తదితరులు పాల్గొన్నారు.

## అడ్డంగా ఉన్న స్తంభాలు తొలగించాలని వినతి



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** నగరంలోని పత్తేఖాన్ పేట, రమేష్‌రెడ్డి నగర్ ప్రాంతంలో రోడ్డుకు అడ్డం ఉన్న విద్యుత్ స్తంభాలు తొలగించాలని నగర పాలక సంస్థ కమిషనర్ వైవా నందన్ కు బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి యాకసిరి పణి రాజు వినతి పత్రం సమర్పించారు. సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన కమిషనర్ నుకలిసి వినతిపత్రం సమర్పిం చారు. ఈప్రాంతంలో పాఠశాలు, కాలేజీలు, ఆసుపత్రిలు, ఎక్కువగా ఉన్నాయని దీంతో ఈ ప్రాంతంలో ప్రజల రాకపోకలు ఎక్కువగా ఉన్నా యని, అయితే రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాల వల్ల వాహన దారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వాటి తొలగించేందుకు విద్యుత్ శాఖ అధికారుల ద్వారా తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

## రంగనాథునికి కానుకగా బంగారు, వెండి కిరీటాలు



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలోని అత్యంత పురాతనమైన, ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ తల్పగిరి రంగనాథ స్వామి వారి దేవస్థానములో భక్తుల సేవా తత్పరత మరోసారి చాటుకుంది. సోమవారం నెల్లూరుకు చెందిన భక్తులు వాయుగుండ్ల చెంచు నిహార్ స్వామివారిపై ఉన్న అపారమైన భక్తితో భారీ విరాళాన్ని సమర్పించారు. సుమారు 364.440 గ్రాముల బరువు కలిగిన బంగారు కిరీటాన్ని, అలాగే సుమారు 233.740 గ్రాముల బరువు కలిగిన వెండి కిరీటాన్ని దేవస్థానానికి విరాళంగా అందజేశారు. మొత్తం 60లక్షల రూపాయల అంచనా విలువ కలిగిన ఈ అమూల్యమైన ఆభరణాలను చెంచు నిహార్ దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఆళ్ళ శ్రీనివాస రెడ్డికి అధికారికంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, భక్తులు స్వామివారికి జరిగిన ఈ విశేష సమర్పణ పట్ల హర్షం వ్యక్తం చేశారు.

## కొండ్లపూడి ప్రాథమిక పాఠశాల పరిశీలన



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** రూరల్ మండలంలోని కొండ్లపూడి ప్రాథమిక పాఠశాలను డైట్ ఉపన్యాసకులు డాక్టర్ బి.శ్రీనివాసులు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల అసెస్మెంట్ బుక్స్, ఉపాధ్యాయుల హ్యాండ్ బుక్స్, విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు, పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ మినిట్స్‌ను, మధ్యాహ్న భోజన పథక రికార్డులను, విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలించి, విద్యార్థుల ప్రగతి కోసం ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలని సూచించారు. అలాగే మధ్యాహ్న భోజనంను పరిశీలించి, సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.